



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త






epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 122 పేజీలు: 10+4 వెల: 6.50




వార్త

ఏ పని అయినా తరచూ చేస్తూంటేనే ఒక అలవాటుగా మారుతుంది. ఆ అలవాటును కొనసాగిస్తే మనసులో పాతుకుపోతుంది.

-ఎడ్వర్డ్స్

# 'సర్' ఇక పాశుపతాస్త్రమే!

ఎట్టకేలకు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)కు పూర్తిస్థాయి చట్టబద్ధత లభించింది. నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగం నిర్దేశించిన ఆదేశిక సూత్రాలకు ఈ ప్రక్రియ జీవం పోస్తుందని వ్యాఖ్యానించింది. ఎన్నో అనుమానాలు, అపార్థాలు ఎన్నో అవరోధాలు, ఆందోళనల మధ్య'సర్' ప్రక్రియ ఎన్నో మార్పులు, సూచనలు సలహాలతో ఒక పటిష్టమైన ఓటరు గుర్తింపు ప్రక్రియ రూపు దాల్చినట్లుగా ఉంది. 'సర్' ప్రక్రియలో పారదర్శకత లోపించిందని కేవలం విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఆయా పక్షాలను ఓటమి పాలు చేయడానికే ఈ ప్రక్రియ ఉపయోగపడ్తోందని, ఎన్నో అనుమానాలతో విపక్షాలు చాలా కాలంగా రాద్ధాంతం చేస్తున్నాయి.నిన్నమొన్నటి వరకు బీహార్‌లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో ఒకే రకమైన ఆరోపణలు, రచ్చ అన్నీ పూర్తయ్యాక తాజాగా శంఖంలో పోసిన తీర్థం మాదిరి 'సర్' ప్రక్రియ పరమపవిత్ర ఎన్నికల ప్రక్రియ, ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ఆవశ్యకమేనని సుప్రీం ధర్మాసనం భాష్యం చెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 21(3) ప్రకారం ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణలు చేపట్టేందుకు ఎన్నికల కమిషన్‌కు ప్రత్యేక అధికారాలు ఉన్నట్లు ధర్మాసనం ధృవీకరించింది. బీహార్‌లో 'సర్' ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్‌లపై పూర్తి స్థాయి విచారణ అనంతరం ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరపాలన్న రాజ్యాంగ నిర్దేశిత సూచనలను ముందుకు తీసుకెళ్తుంది. ఈ ప్రక్రియలో ఏ చట్టమూ ఉల్లంఘనకు నోచుకోలేదు.ఏ రాజ్యాంగ నిబంధనకూ వ్యతిరేకంగా జరుగలేదని ధర్మాసనం స్పష్టంగా పేర్కొంది. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ 'సర్' జీవనాడి వంటిదని సుప్రీం కోర్టు తీర్పు వచ్చాక కూడా కొన్ని రాష్ట్రాల్లో నిరసన శబ్దాలు తలెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ, మరికొన్ని రాష్ట్రాల్లోనూ బిజెపి నెగ్గేందుకు 'సర్' ముందు వచ్చిన విమర్శల బాపతు టక్కుటమార గోకర్ణ విద్యలకేమీ ఆస్కారముండని విధంగా కన్నేసి ఉంచాలని కొన్ని ప్రాంతీయ పార్టీలు చప్పుడు చేశాయి. నిజానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసిన అంశాలపై మరో మాటమాట్లాడేందుకు ఎవరూ సాహసించరు. 'సర్'ను ఆట పట్టించే విపక్షాలు ఇక పైనున్నా గొంతు సవరించుకోవడం మంచిది. ఎన్నికలో ఓటింగ్ యంత్రాలు, వివిప్యాట్ స్లిప్‌ల విషయంలో ఆరోపణలొచ్చి దశాబ్ద కాలమైనా వాటిపైన ఇంకా పలు చోట్ల చర్చోపచర్చలు జరుగుతూనే ఉన్నాయి. వాటిలో లోపాలున్నాయని గెలిచిన వారు, ఓడిన వారి మధ్య మాటలు అటూ ఇటూ మారుతుంటాయి. అలాంటి పరిస్థితులు 'సర్' విషయంలో రారాదు. 'సర్' విషయంలో సుప్రీం ధర్మాసనమిచ్చిన తీర్పుతో తాము గౌరవ ప్రదంగా ఏకీభవించలేకపోతున్నట్లు కాంగ్రెస్ చెప్పనే చెప్పింది. 'సర్' ప్రక్రియ అమలు నేపథ్యంలో విస్తృతంగా అనుమానపడిన అంశాల్లో ఓటు పౌరసత్వం లింక్‌పై ధర్మాసనం స్పష్టంగా చెప్పడమొక్కటే కాస్త ఊరట కలిగించే విషయం. ఓటరు జాబితా ద్వారా ఒక వ్యక్తి పౌరసత్వాన్ని అంతిమంగా నిర్ధారించే అధికారం ఎన్నికల కమిషన్‌కు లేదనిస్పష్టంగా పేర్కొంది. గుర్తింపు కార్డుల విషయంలో ధర్మాసనం పలు మార్గదర్శకాలిచ్చినట్లే మరికొన్ని అంశాల విషయంలో ఓటరుకు పలు ఉపశమనాలివ్వడం విశేషం. ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయమైన అత్యద్భుత ఓటర్ల జాబితా సవరణ ఏదైనా ఉందంటే అది తమదేనని కాలర్ ఎగరేసి చెప్పుకునేందుకు కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు పట్టు చిక్కింది. ఓటర్ల జాబితా సవరణ అనగానే ఎన్నికలు వచ్చే ముందు రోజుల్లో పలకరించి వెళ్లే ప్రక్రియ కాదని, దానిలోనూ చెప్పుకోదగిన మతలబులున్నాయని విపక్షాలు కోడైకూసాయి. ఈ ప్రక్రియకు ఇటీవలనే సుప్రీం ధర్మాసనం కితాబివ్వడంతో చట్టబద్ధత ఏర్పడినట్లయింది. కేవలం సెక్యులర్ ఓటర్లను ఓటర్ల జాబితాలో కొన్ని వర్గాలపై, వారి వలసలపై,వారి జాతులపై వచ్చిన విమర్శలు, వారి వ్యవహారాలు వాటన్నిటిపై లేవనెత్తిన సందేహాలకు ఆదిలో సరైన జవాబులు దొరక్క విపక్షాలు ఎన్నికల కమిషనర్‌పై ఆగ్రహోద్రగ్యులయ్యాయి. న్యాయసమ్మతమైన ఓటర్ల జాబితా సవరణ జరగకపోతే ప్రతిపక్ష సానుభూతిపరులు ఓట్లకే ఎసరు పెడ్తుంటారని అందుకే తమ ఓటర్లను కాపాడుకునేందుకుతరచు ఎన్నికల కమిషన్‌తో విపక్షాలు తగవుకు దిగాయి. పలు సందర్భాల్లో విపక్షాల నిరసనగొంతు వినపడింది కూడా. వివిధ సీజన్‌లలో పనిపాటల కోసం పొరుగూర్లకు వెళ్లే వారి ఓటర్ల పేర్లను కూడా తీసేయడం మొదట్లో కొంత అలజడి సాగింది. అలా ఏదో కారణం చూపిన ఎత్తున ఓటర్లకు ఓటు హక్కు లేకుండా చేస్తున్నారని గుసగుసలు బయలుదేరాయి. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో 90 లక్షలకుపైగా ఓట్లను తొలగించి, కేవలం 30 లక్షల ఓటర్లను వెరిఫికేషన్ తర్వాత చేర్చుకొన్నారు. ఈ కారణం చేతనే తృణమూల్ పార్టీ ఘోర పరాజయం పొందిందన్న అప్రపథనెదుర్కొంది. ఒకసారి బీహార్‌లో ఎంతో స్వచ్ఛంగా సమగ్రంగా ఓటర్ల జాబితా కూర్పు జరిగి ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయన్న ప్రశంసలు పొందిన ఎన్నికల కమిషన్ తదనంతరం పశ్చిమ బెంగాల్ నుంచి అదే మాదిరి ఆదేశాలతో ముందడుగువేసింది. ఎన్నికల కమిషన్ ఒకపక్క ఆరోపణల మెట్టునూ ఎక్కి అగ్ని పరీక్షలో గెలిచింది. 'సర్' ప్రక్రియ జరిగిన రాష్ట్రాల్లో తమ హక్కును నిరూపించేందుకు ఓటర్లకు ఎన్నో కష్టాలుపడాల్సి వచ్చింది.ఎన్నో ఆపసోపాలు పడినాకేంద్ర ఎన్నికల సంఘం బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికలను గట్టెకించింది. 'సర్'కు ధర్మాసనం ఇచ్చిన చట్టబద్ధత, ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ అనంతరం సిఇసి తన ఘనత నిలబెట్టుకుంది.

కోపం ఒక ఘనత అనుకొని, లాభం అనుకుని దానికి లొంగిపోయిన వారికి అందువల్ల కలిగే కీడు అనుభవించక తప్పదు.



తిరుక్కురళ్

చదవడం వల్ల ప్రయోజనం ఏమిటంటే నలుమూలల నుంచి వచ్చే విజ్ఞానాన్ని అంగీకరించడం దాని నుండి గుణపాఠాలు నేర్చుకోవడం.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### రైతుకు భరోసా కావాలి

తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు అంశం ప్రతి సీజన్‌లో రాజకీయవేడిని రాజేస్తున్నప్రధాన సమస్యగా మారింది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను తామే కొనుగోలు చేస్తున్నామని ప్రకటిస్తుంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఎఫ్‌సీఐ (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా)ధాన్యంసేకరణలో కీలక పాత్ర పోషిస్తోందనే వాస్తవం అందరికీతెలిసిందే. అయినప్పటికీ ఈఅంశాన్ని స్పష్టంగా రైతులకు వివరించాల్సినరాజకీయ పార్టీలు పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలం గడుపుతున్నాయి. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండూ ధాన్యం కొనుగోలు అంశంపై ఒకదానిపై ఒకటి విమర్శలు గుప్పించుకున్నాయి. కొనుగోళ్లపై చర్యలు వీడి బిజెపి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నది.అయితే ఈరాజకీయ పోరాటాలమధ్య అసలు రైతు మాత్రం అయోమయంలో పడిపోయాడు. ధాన్యం కొనేది ఎవరు? బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు సమాధానం దొరకని పరిస్థితి ఏర్పడింది.

- ఇ. సంజీవరెడ్డి, కరీంనగర్

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈ మధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది. అది సహజం, వాస్తవం కూడా. యువకుల సంఖ్య బలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజిక స్తితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

### నోడల్ ఆఫీసర్ అవసరం

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న ఆదివాసుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సంస్కృతిని ప్రభుత్వం వీరికి కలిపిస్తున్న హక్కులు, చట్టాలను ఆదివాసులకు తెలియజేయడం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్‌లను డిప్యుటేషన్ పద్ధతిలో నియమించాలి.అందుకోసం ట్రైబల్ గురుకులాల్లో పని చేస్తున్న లెక్చరర్, పరిశోధక డాక్టరేట్ లెక్చరర్, రచయితలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ట్రైబల్ స్టడీస్ ఆప్షనల్ సబ్జెక్టు కలిగిన లెక్చరర్‌లను ఆదివాసుల నోడల్ ఆఫీసర్‌గా నియమించాలి.

-కదురు శ్రీనివాస్,వరంగల్

### పొదుపు చేద్దాం!

పాలకులు పంచుతున్న ఉచితాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింత క్రుంగదీస్తున్నాయి. అధికారం కోసం ఎవరికి తోచిన విధంగా వారు ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత బియ్యం, ఉచితకరెంటు, ఉచిత బస్సు ఇలాఅన్ని ఉచితాలు ఇస్తుపోతూ రాష్ట్రాలుఅప్పుల్లో కూరుకుపోతున్నాయి.అర్హులను ఆదుకుంటే పర్వాలేదు. కానీ, చాలా మంది అనర్హులు ఉచిత పథకాల వల్ల లబ్ధి పొందుతున్నారు. దాంతో ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతోంది.మన ఆర్థిక పరిస్థితిని మనమే చేతులారా నాశనం చేసుకుంటున్నాం.ఇప్పటికైనా ఈవిషయంలో ఆలోచించి నిరుపేదలకు మాత్రమే ఉచితాలు ఇస్తేబాగుంటుంది. అనర్హులను గుర్తించడం, ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవడం, కష్టం రాకముందే వనరులను సమకూర్చుకోవడం, వాటిని దుబారా చేయకుండా రేపటి కోసం దాచుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### టెట్ పాసైతే ప్రమోషన్!

ప్రజలు ఎన్నుకున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసే చట్టాలను గౌరవించమని కోర్టులు తీర్పులు చెబుతాయి. విద్యా హక్కు చట్టం వచ్చిన తర్వాత టీచర్లు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు రిలేషన్షిప్స్ కంప్లీట్‌గా మారిపోయాయి. టీచింగ్ ఇష్టపడని కోచింగ్ ఇష్టపడే రోజులు వచ్చేసాయి. టీచరుగా చేరడానికి ట్రైనింగ్, ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకోవడానికి ఒక టెస్ట్, ప్రమోషన్ల కోసం డిపార్ట్మెంట్ టెస్ట్‌లు, ఎడ్జ్ ఆఫ్ రిటైర్మెంట్ వరకు కూడా ఏదో ఒక టెస్ట్ రాయమని టెట్ రాయమని చట్టాలు చెబుతూనే ఉంటాయి. 58 సంవత్సరాలకే ప్రభుత్వ ఉపాధ్యాయులని ఉద్యోగ విరమణ చేయించాలి. ఓల్డ్ పెన్షన్ స్కీంలో పెన్షన్ ఇవ్వలేని కారణంగా 58 సంవత్సరాలు దాటి 62సంవత్సరాల లోగా ఉన్న టీచర్లు ఎవరైతే టెట్ పాస్ అయ్యారో వాళ్లకి తక్షణమే ప్రమోషన్లు ఇచ్చి ఉద్యోగంలో చేరినందుకు ఒక ప్రమోషన్ వచ్చింది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### వీధి కుక్కలను నివారిద్దాం

నేడు గ్రామాల్లో వీధి కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. ప్రజలను, వృద్ధులను తరచూ కరుస్తూ గాయాలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రజలు బయటికి వెళ్లాలంటే చాలా భయాందోళనకు గురవుతున్నారు. ఈ కుక్కల బెడద వలన కుటుంబాలు మరుగునపడుతున్నాయి. కావున పై అధికారులు వైద్య సిబ్బంది తగు చర్యలు తీసుకుని వీధి కుక్కల బెడద నుంచి ప్రజల్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ప్రపంచ శాంతిని పరిరక్షించేదెవరు?

**అంతర్జాతీయ చట్టాన్ని (ఇంటర్ నేషనల్ లా) గౌరవించే మార్పు దేశాలకు రానంతకాలం ఈ పరిస్థితులు మరింతగా పెరిగే అవకాశం కనపడుతున్నది. పూర్తిగా చట్టాన్ని పరిరక్షించే మాటలు అటుంచి కనీసం చర్యలు తీసుకొని తాత్కాలికంగా అయినా ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి అందరం తోడ్పడక తప్పదు అన్న ఏకాభిప్రాయానికి రావల్సిన అవసరం ఎంతైనా ఉంది. యు.యన్ నిరర్థకంగా మారుతున్నది. అందుకే ప్రపంచంలో శాంతి పరిరక్షణలో కొన్ని యూరప్ దేశాలు, ఆసియాలోని ముఖ్యమైన దేశాలతోపాటు చైనా, భారత్ నార్వేతోపాటు స్కాండినేవియన్ దేశాలు ముందుకు వచ్చి సత్వర చర్యలు శాంతి కోసం పారదర్శకంగా, సమన్వయంతో తీసుకోక తప్పదు. పిల్లికి గంట కట్టడానికి ఎవరు ముందుకు వస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదం తప్పించుకోకపోతే ఏ దేశమూ ఏ ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టలేదు.**



రావులపాటి సీతారాం రావు

ఇదివరకటి కాలంలో జర్నలిస్టులకు పత్రికలలో వార్తలు కానీ కథనాలు రాయటం కానీ తేలిగ్గా ఉండేదని ఆ మధ్య ఒక సీనియర్ రిటైర్డ్ జర్నలిస్టు మాటల్లో చెప్పాడు. అదే ధోరణిలో ఒక రిటైరయిన వ్యాసకర్త వార్తాలోకం అంతా గజిబిజిగా ఉంది. ఒక రోజున డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో యుద్ధం ఆపాం అని చెప్తాడు. మరో రోజు ఇంకా చర్చలు సాగుతూనే ఉన్నాయని అంటాడు. ఇంకో రోజున ఇరాన్‌ను సమూలంగా పెకిలించి వేస్తాం అని చెప్తాడు.ఇరాన్ యుద్ధం ఆపేది లేదు అంటుంది కానీ పాకిస్థాన్‌తో మీడియేషన్‌లో పాల్గొంటుంది. పాకిస్థాన్, అమెరికా దేశం వెంబడి ఉంటూనే లోపాయికారీగా ఇరాన్ కొమ్ముకాస్తుంది. పశ్చిమ ఆసియాలో యుద్ధతతంగం ఇలా ఉంటే అటు పక్క రష్యా, ఉక్రెయిన్ నిప్పుల కొలిమిని ఆరనీయకుండా ఎవరికి వారు రవ్వలను ఆ కొలిమిలో వేస్తూ యుద్ధ జ్వాలలు ఆరనీయకుండా చూస్తూనే ఉన్నారు. సందులో సడేమియా మాదిరి చైనా, రష్యాలు చమురు ఉత్పత్తుల విస్తరణతోపాటు తమకు ఆయాచితంగా ఆయిల్, ఆయుధం ప్రపంచాన్ని శాసించడానికి దొరుకుతే బాగుండునని అటూ ఇటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ డిప్లమసీలో తమ ప్రావీణ్యతను ప్రదర్శిస్తున్నాయి. బలమైన ఏ ఒక్క దేశం ప్రపంచ శాంతి కోసం పాటుపడకపోవడం శోచనీయం. ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితులలో భారత్ మాత్రం సహనాన్ని వీడకుండా అన్ని దేశాల మధ్య సృహృద్భావం నెలకొల్పాలనే సదుద్దేశ్యంతో అవకాశం దొరికినప్పుడల్లా చర్చలూ, సంప్రదింపులూ దేశ ప్రధాని మోడీ ద్వారా కొనసాగిస్తూ తన ఉనికినీ, అంతర్జాతీయ దౌత్య వ్యవహారాలలో తన ప్రావీణ్యతను నిరూపించుకోటానికి అట్టహాసం, ఆర్భాటం లేకుండా ప్రయత్నిస్తూనే ఉంది. అయితే ఇవ్వన్నీ ఎదుర్కొంటూనే ఆర్థిక వ్యవస్థ మన దేశంలో నిర్వీర్యంకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికే కాదు, రాజకీయంలో ఉన్న అందరి నాయకులకూ పారిశ్రామికవేత్తలకూ, ఉత్పత్తిదారులకూ, రాష్ట్రాలను నడిపే ముఖ్యమంత్రులతోపాటు దేశంలోని అధికారులు, పాత కొత్త అనే భేదం లేకుండా అందరికీ వర్తిస్తుంది. ఉద్యోగస్థులు మాకు ఇది పెంచాలి, అది పెంచాలి అని, నిరుద్యోగులు భృతి అడుగుతూ స్వయంగా సంపాదన చేయకుండా కూర్చోటం కానీ, పెన్షనర్లు మాకు పే కమిషన్ రికమెండేషన్స్‌తో నిమిత్తం లేకుండా ఇంకా వచ్చే డబ్బును పెంచాలని కోరటం ఈ పరిస్థితులలో భావ్యం కాదు. అన్నిధరలూ పెరుగుతున్నాయి. మేం ఏం చేయాలి అని వాపోయేబదులు ఏ విధంగా మనం ఉన్నంతలో సరిపుచ్చుకొని దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయకుండా కాపాడాలనే విజ్ఞతతో బాటు బాధ్యతను గుర్తించిన నాడే నిజమైన పౌరులు అని అనిపించుకుంటాం. ప్రస్తుత పరిణామాలు మనం ఊహించినవి కావు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్ ప్రైమ్ మినిష్టర్ ఏ కారణం చేతనో కేరటాలు లేని సముద్రాన్ని కదిపారు.





ఇరాన్‌ను కట్టడి చేయాలని ఆ రెండు దేశాలూ, ఉక్రెయిన్‌ను కట్టడి చేయాలని రష్యా, ఇండియాకు ఇబ్బందులు ఇబ్బడి ముబ్బడిగా తెచ్చి పెట్టాలని పాకిస్థాన్, చమురు కృత్రిమ కొరత వల్ల ఎంతో కొంత వెనకవేసుకోవాలి అని చైనాతో కొన్ని ఇతర దేశాలు యుద్ధం మనం పొలిమేరల్లోకి వస్తే చూద్దాం అనే ధోరణిలో ప్రవర్తిస్తున్నాయి. తాచెడ్డ కోతి నిలువెల్లా చెరుపుచేస్తుందనే ఆలోచనను సక్రమంగా ఆదేశాలు విశ్లేషించగులుగుతే కలిసికట్టుగా ఈ అనవసరపు ఉపద్రవాన్ని ఆపే ప్రయత్నాలు తలపెట్టే అవకాశాన్ని అయినా ఈపాటికి తీసుకొని ఉండేవారు.గత 100 సంవత్సరాలకుపైన హేగ్, జెనీవా యుయన్ కన్వెన్షన్స్ కొన్ని ఒడంబడికలు, ఆచరణ యోగ్యమైన సూత్రాలు ఆధారంగా మానవ హక్కులు, ఆయుధాల నియంత్రణ, సముద్రాలపై చట్టాలననుసరించి అంతకుమునుపు ఉన్న అరాచకత్వాన్ని పారద్రోలి రూల్స్ ఆధారంగా ఒక ఆర్డరును ప్రపంచానికి సమకూర్చారు. ఇప్పుడవన్నీ ఉల్లంఘించటమే కాకుండా ప్రపంచ శాంతికి, సుస్థిరతకు బీటలు వారే ధోరణిలో ప్రభుత్వాల అధినేతలు కొందరు వ్యవహరించటం దురదృష్ట పరిమాణంగా చెప్పక తప్పదు. అప్పుడు ఒప్పుకున్న ముఖ్యమైన మార్గదర్శక సూత్రాల ప్రకారం యుఎన్ ఛార్టర్,సార్వభౌమాధికారాన్ని ఉల్లఘించటం, బలప్రయోగం, దేశాల సరిహద్దులను అతిక్రమించటం నిషేధించింది. కానీ ఇప్పుడు అవే విశృంఖలంగా జరుగుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ (2022లో) ఆక్రమణ 2026లో అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ మీద యుద్ధం తలపెట్టడం, ఆ ఛార్టర్‌లోని నిషేధాన్ని ఘోరంగా ఉల్లంఘించటమే! పైగా ఉల్లంఘనలను సమర్థించుకోటానికి మిలటరీ బలగాలను ఇష్టానుసారం వాడటం పూర్తిగా అన్ని కన్వెన్షన్స్‌ను యుఎన్ భారత్‌ను త్రోసి రాజనటమే అని ఘంటా పథంగా చెప్పక తప్పదు. అంతకు మునుపు కూడా అమెరికా, రష్యా తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోటానికి ఇరాక్ మీద దాడి (2003) సెక్యూరిటీ కౌన్సిల్ రిజల్యూషన్ లేకుండా చేయడం జరిగింది. తరువాత సమర్థించుకొనే ప్రయత్నం అపహాస్యంగా మారింది. ఈ మధ్య ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమెనీని టార్గెట్ చేసి చంపటం కూడా ఆ కోవలోకే వస్తుంది. గాజా లెబనాన్‌ల మీద ఇజ్రాయిల్ నిరంతర దాడులు, బాంబులు వేయడాలు అమాయక పౌరుల ప్రాణనష్టం ఆస్థి నష్టాలను అహంకారంతో ప్రవర్తించే ఈ ప్రభుత్వాల ఆధిపత్య ధోరణి సహించలేని ఎత్తుకు చేరుకుంది. సాధారణ పౌరులు, బలహీన దేశాలు, చివరకు అన్ని దేశాల సభ్య సమాజాలు తల ఎత్త లేని పరిస్థితులను బరితెగించి వీరు ఏర్పరుస్తున్నారు. కేవలం బలమైన దేశాలకే అహంకార ధోరణితో ఉల్లంఘనలు తలపెట్టడం పరిమితం కాలేదు. ఉత్తర సిరియాలోకి టర్కీ దేశం చొరబడటం, ఇలాంటి పరిణామం కిందనే లెక్కించక తప్పదు. అంతర్జాతీయ చట్టాన్ని (ఇంటర్ నేషనల్ లా) గౌరవించే మార్పు దేశాలకు రానంత కాలం ఈ పరిస్థితులు మరింతగా పెరిగే అవకాశం కనపడుతున్నది. పూర్తిగా చట్టాన్ని పరిరక్షించే మాటలు అటుంచి కనీసం చర్యలు తీసుకొని తాత్కాలికంగా అయినా ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి అందరం తోడ్పడక తప్పదు అన్న ఏకాభిప్రాయానికి రావల్సిన అవసరం ఎంతైనా ఉంది. యు.యన్ నిరర్థకంగా మారుతున్నది. అందుకే ప్రపంచంలో శాంతి పరిరక్షణలో కొన్ని యూరప్ దేశాలు, ఆసియాలోని ముఖ్యమైన దేశాలతోపాటు చైనా, భారత్ నార్వేతోపాటు స్కాండినేవియన్ దేశాలు ముందుకు వచ్చి సత్వర చర్యలు శాంతి కోసం పారదర్శకంగా, సమన్వయంతో తీసుకోక తప్పదు. పిల్లికి గంట కట్టడానికి ఎవరు ముందుకు వస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదం తప్పించుకోకపోతే ఏ దేశమూ ఏ ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టలేదు. ●

# నమ్మకం సడలుతున్న పరీక్షా వ్యవస్థ!


టి. శ్రీనివాస్

దేశ భవిష్యత్తును నిర్మించేది విద్యా వ్యవస్థ. ఆ వ్యవస్థకు నమ్మకాన్ని అందించేది పారదర్శకమైన పరీక్షా విధానం. కానీ ఇటీవలి కాలంలో సీబీఎస్‌ఈ, ఎన్టీఏ నిర్వహిస్తున్న పరీక్షల చుట్టూ ఏర్పడుతున్న వివాదాలు, ప్రశ్నాపత్రాల లీకులు, సాంకేతిక లోపాలు, నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలు విద్యార్థుల్లోనే కాకుండా తల్లిదండ్రుల్లో కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ఈ పరీక్షలపై ఆధారపడి ఉండగా, వ్యవస్థపై నమ్మకం దెబ్బతినడం అత్యంత ప్రమాదకరం. ప్రత్యేకంగా నీట్ పరీక్షల విషయంలో గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న ఆరోపణలు, అవకతవకలు విద్యా రంగంలో పెద్ద సంక్షోభానికి సంకేతంగా మారాయి. కేవలం పరీక్ష నిర్వహణలో చిన్న తప్పిదం కాదు, ఇది దేశ యువత ఆశయాలపై పడుతున్న మచ్చ. చదువుకుని మెరుగైన ర్యాంకు సాధించాలనేవిద్యార్థి కృషిని కొన్ని అక్రమ శక్తులు డబ్బుతో కొనగలుగుతున్నాయనే భావన పెరగడం అత్యంత దురదృష్టకరం. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ, విద్యాశాఖ మొదట చేయాల్సింది విద్యార్థుల విశ్వాసాన్ని పునరుద్ధరించడం. అది కేవలం ప్రకటనలతో సాధ్యం కాదు. నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది.ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడిన వ్యక్తులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాలు, అధికారులపై ఉదాహరణగా నిలిచే విధంగా శిక్షలు విధించాలి. తప్పు చేసిన వారు ఎంత ప్రభావశీలులైనా ఉపేక్షించకూడదు. అప్పుడే వ్యవస్థపై ప్రజలకు మళ్లీ నమ్మకం కలుగుతుంది. ఇక పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానం ద్వారా నిర్వహించడం పారదర్శకతకు కొంతవరకు ఉపయోగకరమనే అభిప్రాయం ఉంది. నిజానికి డిజిటల్ పరీక్షా విధానం వల్ల ప్రశ్నాపత్రాల ముద్రణ, రవాణావంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంది. ప్రశ్నల ర్యాండమైజేషన్ వల్ల ఒకే ప్రశ్నాపత్రం లీక్ అవ్వడం ద్వారా మొత్తంవ్యవస్థ దెబ్బతినే అవకాశాలు కూడా తగ్గుతాయి. అయితే కేవలం సీబీటీ విధానం ప్రవేశపెట్టడం వల్లనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భావించడం పొరపాటు.భారతదేశం వంటి విస్తారమైన దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు సమానంగా లేవు. నగరాల్లో ఉన్న విద్యార్థులకు లభించే సౌకర్యాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండవు. చాలాచోట్ల ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, కంప్యూటర్ల కొరత వంటి అంశాలు పరీక్షల నిర్వహణను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఒక చిన్న సాంకేతిక లోపం కూడా విద్యార్థి భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తుంది. అందువల్ల సిబిటి విధానాన్ని అమలు చేయాలంటే ముందుగా దేశవ్యాప్తంగా సమగ్ర సన్నద్ధత అవసరం. అత్యంత ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లో సాంకేతిక లోపాలను ముందుగానే గుర్తించే 'ఫెయిల్‌సేఫ్ మెకానిజం' ఉండాలి. సర్వర్లు డౌన్ కావడం, సిస్టమ్ హ్యాంగ్ అవడం, లాగిన్ సమస్యలు, డేటా కోల్పోవడం వంటి సమస్యలు పరీక్షల సమయంలో తలెత్తితే విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతారు. కాబట్టి ప్రతి పరీక్షా కేంద్రంలోప్రత్యామ్నాయ సర్వర్లు, బ్యాకప్ పవర్ సిస్టమ్స్, సాంకేతిక బృందాలు సిద్ధంగా ఉండాలి. ఒక కేంద్రంలో సమస్య వచ్చినా పరీక్ష నిరంతరాయంగా కొనసాగించే సామర్థ్యం వ్యవస్థకు ఉండాలి. ఇంకో కీలక అంశం సైబర్ భద్రత. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో పరీక్షా వ్యవస్థలు కూడా హ్యాకర్ల లక్ష్యంగా మారుతున్నాయి.విద్యార్థుల వ్యక్తిగత వివరాలు, ప్రశ్నాపత్రాల డేటా బేస్, ఫలితాల సమాచారాన్ని రక్షించడానికి అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు అవసరం. ఇందుకోసం ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టాలి.కేవలం సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేయడం సరిపోదు, నిరంతర పర్యవేక్షణ, భద్రతా పరీక్షలు, నిపుణుల నియామకం వంటి చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పరీక్షా నిర్వహణలో పారదర్శకత పెరగాలి. ఏ సమస్య వచ్చినా విద్యార్థులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. పరీక్షా తేదీలు మారినప్పుడు, సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు, ఫలితాల ప్రకటన ఆలస్యమైనప్పుడు అధికారుల మౌనం విద్యార్థుల్లో అనుమానాలను పెంచుతుంది. కాబట్టి ఎన్టీఏ వంటి సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు సమయానుకూల సమాచారం అందించాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్యం కూడా ఇక్కడ కీలక అంశమే. ఇప్పటికే తీవ్రమైన పోటీ, కోచింగ్ ఒత్తిడి, కుటుంబ ఆశలు విద్యార్థులపై భారంగా మారుతున్నాయి. దానికి తోడు పరీక్షలపై అనిశ్చితి పెరిగితే వారు తీవ్ర నిరాశకు గురయ్యే ప్రమాదం ఉంది. పరీక్షా వ్యవస్థ న్యాయంగా లేదనే భావన విద్యార్థుల్లో పెరగడం సమాజానికి మంచిది కాదు. ప్రతిభ కంటే అక్రమ మార్గాలు విజయాన్నినిర్ణయిస్తున్నాయనే భావన దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ, ఎన్టీఏ సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. పరీక్షా వ్యవస్థను కేవలం నిర్వహణపరమైన అంశంగా కాకుండా దేశ యువత భవిష్యత్తుతో ముడిపడిన బాధ్యతగా చూడాలి. నమ్మకమే విద్యా వ్యవస్థకు మూలస్తంభం. ఆ నమ్మకాన్ని కాపాడటంలో విఫలమైతే ఎంత ఆధునిక సాంకేతికత ఉన్నా ప్రయోజనం ఉండదు. చివరగా చెప్పాలంటే, ఇది దేశ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ●

# సమాజంలో మార్పు జనరేషన్ జెడ్‌తోనే సాధ్యం

నల్ల రవి కుమార్

తరాల మార్పులో కాలం ఎప్పుడూ సరికొత్త ఆలోచనలను, సరిహద్దులు లేని ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూనే ఉంటుంది. ఆ క్రమంలో మానవ పరిణామ క్రమంలోనే అత్యంత ఆసక్తికరమైన, ప్రత్యేకమైన తరంగా నిలిచింది 'జెనరేషన్ జెడ్' లేదా క్లుప్తంగా 'జెన్ జెడ్'. సాధారణంగా 1997 నుండి 2012 మధ్య కాలంలో జన్మించిన ఈ తరం యువత, అంతకుముందు తరాల కంటే పూర్తిగా భిన్నమైన వాతావరణంలో పెరిగింది. పాత తరాలు సాంకేతికతను అలవాటు చేసుకుంటే, ఈ తరం మాత్రం సాంకేతికతతోనే కళ్ళు తెరిచింది. ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్గా మార్చేసిన ఇంటర్నెట్ విప్లవం వీరి చేతుల్లోనే రూపుదిద్దుకుంది. అందుకే వీరిని 'డిజిటల్ నేటివ్స్' అని పిలుస్తారు. ఈ డిజిటల్ యుగం వారి జీవన విధానాన్ని, అభిరుచులను, కెరీర్ ఎంపికలను ఎలా ప్రభావితం చేస్తుందో, వారి ఆలోచనల్లోని సానుకూల, ప్రతికూల కోణాలు ఏమిటోఅర్థం చేసుకోవడం నేటి సమాజానికి ఎంతో అవసరం. ఈ తరం ఎదుగుదలలో సాంకేతికత ఒక సాధనం మాత్రమే కాదు, అది వారి శ్వాసగా మారింది. డయల్ అప్ ఇంటర్నెట్ కష్టాలు తెలియని, చేతిలో స్మార్ట్ఫోన్, వేగవంతమైన 5జి డేటాతో అప్రయత్నంగా కనెక్ట్ అయిన మొదటి తరం ఇది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సోషల్ మీడియా అల్గారిథమ్ల మధ్య వీరు పెరిగారు. సమాచారం కోసం లైబ్రరీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ప్రపంచంలోని ఏ మూలన ఉన్న విషయమైనా క్షణాల్లో వీరి వేలి కొనలపై ప్రత్యక్షమవుతుంది. ఈ అపరిమితమైన సాంకేతిక లభ్యత వారిని ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దింది. భౌగోళిక సరిహద్దులు, భాషా భేదాలు దాటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్కృతులను, ఆలోచనలను వీరు చాలా సులభంగా స్వీకరించగలుగుతున్నారు.ఈ అపారమైన సాంకేతిక ప్రభావం వారి వ్యక్తిగత అభిరుచులపై, జీవనశైలిపై స్పష్టమైన ముద్ర వేసింది. వినోదం, కళలు, సామాజిక సంబంధాల పట్ల వీరి దృక్పథం పూర్తిగా మారిపోయింది. సాంప్రదాయ టీవీ ఛానెళ్లకు బదులుగా ఓటీటీ ప్లాట్ఫారమ్లు,యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ రీల్స్ వంటి స్వల్పకాలిక కంటెంట్ను వీరు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సంగీతం, ఫ్యాషన్, కళల విషయానికి వస్తే వీరు గ్లోబల్ ట్రెండ్స్ను అనుసరిస్తారు. ఒక కొరియన్ పాప్ గ్రూప్,లేదా ఒక అమెరికన్ వెబ్ సిరీస్ వీరికి ఎంతగానో నచ్చుతాయి. వీరు కేవలం వినియోగదారులుగా మాత్రమే మిగిలిపోకుండా,స్వయంగా కంటెంట్ సృష్టికర్తలుగా మారుతున్నారు. ఇంటర్నెట్ కల్పించిన వేదికల ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి చాటుకుంటున్నారు.



అలాగే పర్యావరణ పరిరక్షణ, మానసిక ఆరోగ్యం, సమానత్వం వంటి సామాజిక అంశాలపై వీరు సామాజిక మాధ్యమాల్లో గళం విప్పుతూ, తమదైన శైలిలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నారు. కెరీర్ విషయానికి వస్తే, ఈ తరంపాత మూస పద్ధతులను పూర్తిగా తిరస్కరిస్తోంది. తొమ్మిదినుండి ఐదు వరకు చేసే సంప్రదాయ కార్యాలయ ఉద్యోగాలు, స్థిరమైన కెరీర్ అనే పాత తరం భావనల కంటే వీరు 'స్వేచ్ఛ' 'సృజనాత్మకత'కు పట్టం కడుతున్నారు. కేవలం జీతం కోసమే కాకుండా, తాము చేసే పనిలో ఒక అర్థం, సంతృప్తి ఉండాలని వీరు కోరుకుంటారు. సాంకేతికత అందించిన అవకాశాలతో ఫ్రీలాన్సింగ్, డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, యాప్ డెవలప్మెంట్, స్టార్టప్స్ వైపు వీరు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ కూర్చునైనా పనిచేసే 'రిమోట్ వర్క్' లేదా 'హైబ్రిడ్' విధానాన్ని వీరు ఇష్టపడుతున్నారు. సాంప్రదాయ విద్యార్హతల కంటే నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ, నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక స్వతంత్రతను చిన్న వయసులోనే సాధించాలనే పట్టుదల వీరిలో మెండుగా కనిపిస్తుంది. ఈ సరికొత్త తరంఆలోచనా విధానంలో ఎన్నో సానుకూల అంశాలు ప్రశంసించదగినవిగా ఉన్నాయి. వీరు అత్యంత వేగంగా నిర్ణయాలు తీసుకోగలరు. మారుతున్న పరిస్థితులకు త్వరగా అలవాటు పడతారు. వైవిధ్యతను, ఇతరుల భిన్నమైన అభిప్రాయాలను గౌరవించడంలో ఈ తరం ముందుంటుంది. మూఢనమ్మకాలను ప్రశ్నిస్తూ, హేతుబద్ధంగా ఆలోచించడం వీరి ప్లస్ పాయింట్. మానసిక ఒత్తిడి లేదా డిప్రెషన్ వంటి విషయాల గురించి దాచకుండా బహిరంగంగా మాట్లాడటం, అవసరమైతే సహాయం కోరడం వీరిలోని పరిణతిని చూపిస్తుంది. సమాజంలో మార్పు తీసుకురావడానికి డిజిటల్ వేదికలను వీరు ఒక శక్తివంతమైన ఆయుధంగా వాడుకుంటున్నారు. అయితే, నాణేనికి మరో వైపు ఉన్నట్లుగా, ఈ డిజిటల్ జీవనశైలి వీరిలో కొన్ని తీవ్రమైన ప్రతికూలతలను కూడా తెచ్చిపెట్టింది. నిరంతరం స్క్రీన్లకే అతుక్కుపోవడం వల్ల వీరు నిజ జీవిత సామాజిక బంధాలకు, శారీరక కార్యకలాపాలకు దూరమవుతున్నారు. సోషల్ మీడియాలో కనిపించే కృత్రిమమైన ప్రపంచాన్ని చూసి, తమ నిజ జీవితాన్నిదాంతో పోల్చుకుంటూ తీవ్రమైన ఆందోళనకు, అభద్రతా భావానికి లోనవుతున్నారు. ప్రతిదీ క్షణాల్లో జరిగిపోవాలనే డిజిటల్ వేగం వల్ల వీరిలో సహనం,ఏకాగ్రత లోపిస్తున్నాయి. లోతైన విశ్లేషణల కంటే పైపైన కనిపించే సమాచారానికే వీరు త్వరగా ప్రభావితమవుతున్నారు. ఆన్లైన్ ప్రపంచంలో దొరికే తాత్కాలిక గుర్తింపు కోసం ఆరాటపడుతూ, మానసిక ప్రశాంతతను కోల్పోవడం ఈ తరంలో కనిపిస్తున్న ప్రధాన లోపం. ముగింపుగా చెప్పాలంటే, జెనరేషన్ జెడ్ అనేది సమాజ గమనాన్ని మార్చగల అపారమైన శక్తి సామర్థ్యాలు కలిగిన ఒక వినూత్న తరం. సాంకేతికత అందించిన అస్త్రాలతో వీరుప్రపంచాన్ని సరికొత్తగా ఆవిష్కరిస్తున్నారు.ఆన్లైన్ ప్రపంచం సృష్టించేభ్రమలబారినపడకుండా, డిజిటల్ సమతుల్యతను పాటిస్తూ, వాస్తవిక జీవితంలోని విలువలను కూడా అందిపుచ్చుకున్నప్పుడు ఈతరం అనుకున్నదానికంటే అద్భుతమైన విజయాలనుసాధించగలదు.భవిష్యత్తును నడిపించే ఈయువశక్తిని సరైనదిశలో అర్థం చేసుకుని, ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. ●

JEE - ADVANCED 2026
ఓపెన్ కేటగిరీ టాప్ 20లో 7 నారాయణ సాధించిన ర్యాంకులు
అంటే టాప్ 20లో 35% ఫలితాలు
నారాయణవే

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 122 పేజీలు: 10+4 వెల: 6.50

JEE ADV - 2026
ఓపెన్ కేటగిరీ టాప్ 25లో నారాయణ 10 సాధించిన ర్యాంకులు
అంటే టాప్ 25లో 40% ఫలితాలు నారాయణవే
నారాయణ విద్యాసంస్థలు www.narayanagroup.com

47 YEARS OF EXCELLENCE
JEE ADV. 2026
SRAMAYEVA JAYATHE
NARAYANA® EDUCATIONAL INSTITUTIONS

ఆల్ ఇండియా OPEN CATEGORY లో టాప్ 100 లో 36 ర్యాంకులతో JEEని శాసించిన నారాయణ

KARNATAKA STATE TOPPER
1
IIT BOMBAY రీజియన్ టాపర్
B JAYAKRISHNA SRINIVAS
Roll No: 261033130
nPrep

అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 10లో
నారాయణ విద్యార్థులు సాధించిన ర్యాంకులు

2nd RANK T SAI VINEEL Roll: 266138122
4th RANK V HARSHITH Roll: 266053091
5th RANK KUCHI SANDEEP Roll No: 266121063 Narayana School Student
6th RANK B JAYAKRISHNA SRINIVAS Roll No: 261033130 nPrep
6th RANK ISHAN GUPTA Roll: 262059043
6th RANK KALLURI JOSHIKA Roll: 266052008
7th RANK PREETAM M Roll: 261062456
9th RANK NAGAKETHANA .T Roll: 266131060

తెలుగు రాష్ట్రాల నుంచి అచ్చ తెలుగు విద్యార్థికి వచ్చిన బెస్ట్ ఆలిండియా ర్యాంక్
5th RANK
అది సాధించింది నారాయణ మాత్రమే
ఏ ఇతర విద్యాసంస్థకి అచ్చ తెలుగు విద్యార్థితో ఇంతకన్నా బెస్ట్ ర్యాంక్ రాలేదు.

ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీ టాప్ 100లో నారాయణ విద్యార్థులు సాధించిన ర్యాంకులు

AIR 5 KUCHI SANDEEP Roll No: 266121063 Narayana School Student
AIR 6 B JAYAKRISHNA SRINIVAS Roll No: 261033130 nPrep
AIR 13 MANU PARAMESHWARAN Roll No: 261049023 Classroom Student
AIR 14 PRINCE CHOUDHARY Roll No: 262092058 nPrep
AIR 15 VELDURTHI HARSHITH Roll No: 266053091 Narayana School Student
AIR 16 TANAY AGARWAL Roll No: 262078257 nPrep Narayana School Student up to class X
AIR 20 ANISH MUPPALLA Roll No: 266131526 nPrep

AIR 22 ADITYA PAVANKUMAR T
AIR 23 A VENKATA HEMANTH KUMAR REDDY
AIR 24 T SAI VINEEL
AIR 27 ABHIPRAY
AIR 33 KOUSTUB DESPANDAY
AIR 35 UTKARSH
AIR 39 MADHAV VIRADIYA
AIR 41 SNEHAL ROY CHOUDHURY
AIR 44 YASH YADAV
AIR 51 MOPURI VEDA CHARAN REDDY
AIR 54 KOTA YASHWIN
AIR 57 PIYUSH DAKAD
AIR 58 SHRESTH SURAIYA
AIR 60 AGASTYA REMANI
AIR 61 VIVAN SHARAD MAHISWARI
AIR 63 DEEKSHANT SHARMA
AIR 71 PRANEEL DEBNATH
AIR 72 NISHKARSH SINGH
AIR 75 DORANALA BHAVITESH REDDY
AIR 78 ADULA SAI NIKITH
AIR 79 VISHRUT BHATT
AIR 80 TELLURI SHREYAS REDDY
AIR 83 SHIVAM JYOTI
AIR 84 ARNAV JAIN
AIR 88 BEJUGAMA ANSHUL
AIR 89 THAMMINA GIRISH
AIR 98 ANSHU
AIR 99 RUCHIT AGARWAL
AIR 100 ISHAN GUPTA

ఓపెన్ కేటగిరీ టాప్ 20లో నారాయణ సాధించిన ర్యాంకులు 7
అంటే టాప్ 20లో 35% ఫలితాలు నారాయణవే

ఓపెన్ కేటగిరీ టాప్ 25లో నారాయణ సాధించిన ర్యాంకులు 10
అంటే టాప్ 25లో 40% ఫలితాలు నారాయణవే

#YourDreamsAreOurDreams Call: 1800 102 3344 | www.narayanagroup.com

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice
nPrep: Narayana Digital Learning Programme


47 YEARS OF EXCELLENCE
SRAMAYEVA JAYATHE
NARAYANA®
EDUCATIONAL INSTITUTIONS
JEE ADV. 2026
అన్ని కేటగిరీలలో ఆలిండియా 100 లోపు నారాయణ సాధించిన ర్యాంకులు
S R V S S LAKSHMI
T SAI VINEEL
RAGULA ABHINAV SAI
VELDURTHI HARSHITH
PALDE MANJUNATH
DAPPU THANVI SRI.
KUCHI SANDEEP
And Many More....
IIT-JEE LONG TERM CLASSES COMMENCE : 10-06-2026
ADMISSIONS OPEN FOR INTER 2026-28
అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 10 ర్యాంకులు
8
అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 50 ర్యాంకులు
71
అన్ని కేటగిరీలలో ఆల్ ఇండియా టాప్ 100 ర్యాంకులు
149
TOTAL SELECTIONS
4501
#YourDreamsAreOurDreams
Toll Free: 1800 102 3344 | www.narayanagroup.com
Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice
As per the information received at the time of publication



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 122 పేజీలు: 10+4 వెల: 6.50



ఖర్గేతో భట్టి భేటీ 7

ప్రారంభమైన విశాఖ రైల్వే జోన్ 9




సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్

## మయన్మార్ శాంతి చర్చలకు భారత్ సంపూర్ణ మద్దతు

### అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్‌తో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు

### వాణిజ్యం, పెట్టుబడులు, సరిహద్దు భద్రత నిర్వహణలో భారత్ సహకారం

**న్యూఢిల్లీ, జూన్ 1:** వాణిజ్యం, పెట్టుబడులు, అనుసంధానం, అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్య పెంపు, భద్రత,సరిహద్దుల నిర్వహణ వంటి రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, సహకరించుకునేందుకు భారత్, మయన్మార్ దేశాలు నిర్ణయించాయి. సోమారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లోయింగ్ విస్తృత చర్చలు జరిపారు. భారత్- మయన్మార్ ద్వైపాక్షిక సంబంధాలను >>7

# తాండాల్లోనూ పక్కా ఇళ్లు

### ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం

### కొలాం కొటారి నుండి సామూహికంగా ఇందిరమ్మ గృహ ప్రవేశం ఆరంభం

### కొత్తగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు

### ప్రతీ గింజను కొంటాం, ఆందోళన వద్దు

### కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ బహిరంగ సభలో సిఎం రేవంత్



సోమవారం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ బహిరంగ సభకు హాజరైన ప్రజలు

సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 1, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గూడెలలో, తండాలలో గుడిసెలేని ఇండ్లను చూడాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని, గుడిసె ఉన్న ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, సీతక్క, అధికారులు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత,సంబంధిత శాఖ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి కుమ్రం భీం జిల్లా కెరమెరి మండలం కొలాం కొటారి గూడెంలో నూతనంగా నిర్మించిన 25 ఇందిరమ్మ ఇండ్లను సామూహికంగా గృహ ప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం >>7



## 'సుప్రీం'కు మరో ఐదుగురు జడ్జిలు

### కేంద్రం ఆమోదం

### 37కు పెరిగిన న్యాయమూర్తుల సంఖ్య

**న్యూఢిల్లీ, జూన్ 1:** సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. దీంతో అపెక్స్ కోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరగా, ఇటీవల మంజూరైన న్యాయమూర్తుల సంఖ్యను విస్తరించిన తర్వాత కేవలం ఒక ఖాళీ మాత్రమే మిగిలింది. న్యాయ మంత్రిత్వ శాఖ జారీ చేసిన వేర్వేరు నోటిఫికేషన్లలో, సీనియర్ న్యాయవాది వెంకిట సుబ్రమణి మోహన, బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్, పంజాబ్ -హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షీల్ నాగు, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా, జమ్మూ కాశ్మీర్- లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ పల్లిల నియామకాలను కేంద్రం ఆమోదించింది. నియమితులైన వారు ప్రమాణస్వీకారం చేసి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా లాంఛనంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ నియామకాలు అమల్లోకి వస్తాయి. ప్రమాణ స్వీకార కార్యక్రమం జూన్ 2న జరిగే అవకాశం ఉంది. మే 27న సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సు మేరకు ఈ నియామకాలు జరిగాయి. కేంద్రం నాలుగు రోజుల్లోనే ఐదు పేర్లనూ ఆమోదించింది.గతనెలలో జారీ చేసిన ఒకఆర్డినెన్స్ ద్వారా, భారత ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు మంజూరైన న్యాయమూర్తుల సంఖ్యను 34 నుండి 38కి కేంద్ర ప్రభుత్వం పెంచిన కొద్ది కాలానికే ఈ ఐదుగురు న్యాయమూర్తుల పదోన్నతి లభించింది. ఈ తాజా నియామకాలతో, సుప్రీంకోర్టు ఇప్పుడు 37 మంది న్యాయమూర్తులతో పనిచేస్తోంది. దీంతో ఇంకా ఒకే ఒక్క స్థానం భర్తీ చేయాల్సి >>7

# జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో తెలుగు హవా

### 5వ ర్యాంక్: కె. సందీప్, 9వ ర్యాంక్: ఎం. నాగ సహర్ష

### 330 మార్కులతో బీహార్ విద్యార్థి శుభమ్ కుమార్ టాపర్.. మహిళల్లో ఆరోహి దేశ్‌పాండే టాపర్

### అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలను ప్రకటించిన ఐఐటి రూర్కీ



1వ ర్యాంక్: శుభమ్ 1వ ర్యాంక్: దేశ్‌పాండే



9వ ర్యాంక్: నాగ సహర్ష

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 1:** దేశంలోని ఐఐటీల్లోని బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) అడ్వాన్స్‌డ్-2026లో బీహార్‌కి చెందిన శుభమ్ కుమార్ 330 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. మహిళల విభాగంలో ఆరోహి దేశ్‌పాండే 280 మార్కులతో టాపర్‌గా నిలిచింది. తెలుగు విద్యార్థులు ఇద్దరు టాప్-10లో చోటు దక్కించుకున్నారు. 318 మార్కులతో కుచి సందీప్ ఆలిండియా 5వ ర్యాంక్‌ను సొంతం చేసుకోగా, 312 మార్కులతో మెడిశెట్టి నాగ సహర్ష 9వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. మంగళవారం నుంచి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలను ఐఐటీ రూర్కీ ఆదివారం అర్ధరాత్రి విడుదల చేసింది. అధికారిక షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 10 గంటలకు ఫలితాలు ప్రకటించాల్సి ఉన్నప్పటికీ, ముందుగానే ఆదివారం అర్ధరాత్రే ప్రకటించింది. అభ్యర్థులు తమ ఫలితాలను జేఈఈ అడ్వాన్స్‌డ్ అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఐఐటీ రూర్కీ ప్రకటించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026లో బిహార్‌కు చెందిన శుభమ్ కుమార్ 360 మార్కులకుగాను 330 మార్కులు సాధించి జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. కబీర్ చిల్లర్ ఆల్ ఇండియా 2వ ర్యాంక్‌ను సాధించగా, జతిన్ చాహర్ మూడో స్థానంలో నిలిచారు. తెలుగు రాష్ట్రాల నుంచి విశాఖపట్నానికి చెందిన కుచి సందీప్ ఆల్ ఇండియా 5వ ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026కు 1,87,389 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 1,79,694 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 56,880 మంది అర్హత సాధించగా అందులో 10,107 మంది బాలికలు, 46,773 మంది బాలురున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారు దేశంలోని 23 ఐఐటీల్లో బీటెక్ కోర్సుల కోసం పోటీపడనున్నారు. మంగళవారం నుంచి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించనుంది. విడతల వారీగా కౌన్సెలింగ్‌ను కొనసాగిస్తూ జులై నాటికి కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేయనుంది. 2025-26 విద్యా సంవత్సరంలో 23 ఐఐటీల్లో 18,160 ఐఐటీ సీట్లు అందుబాటులో ఉండగా ఈ ఏడాది అదనంగా మరో 300 సీట్లు పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## ఉద్యోగుల బదలీలపై మళ్లీ నిషేధం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్1:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ నిషేధం విధిస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి మే నెలాఖరు వరకూ సడలింపు ఇవ్వగా అది ముగిసిన అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1 నుంచి నిషేధాన్ని తిరిగి విధించింది. ఆర్థిక శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, పదోన్నతులు, పోస్టుల రద్దు, పదవీ విరమణలు, స్వదేశానికి తిరిగి పంపడం, డిప్యుటేషన్లు, క్రమశిక్షణా కేసులు, ఆరు నెలలకు మించిన దీర్ఘకాలిక సెలవు నుండి తిరిగి రావడం వంటి నిర్దిష్ట పరిస్థితులలో తప్ప బదిలీలకు అనుమతి >>7



7

## నీట్ రీ-ఎగ్జామ్ ఒఎంఆర్ పద్ధతిలోనే

### ఎన్‌టిఎకు సుప్రీంకోర్టు ఆదేశం

# ప్రతినెలా జాబ్ నోటిఫికేషన్లు

### నేడు మూడు జారీ

### వారంలో మరో రెండు విడుదల

### పరీక్షలు ఆన్‌లైన్ నిర్వహణకు చర్యలు

### ఆర్థిక శాఖ 3800 పోస్టుల భర్తీకి అనుమతి

### టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం




**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 1:** రాష్ట్రంలోని నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) శుభవార్త చెప్పింది. ఇకపై ప్రతి నెలా ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేయనున్నట్టు ప్రకటించింది. నేడు రాష్ట్రఅవతరణ సందర్భంగా మూడు ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేయనున్నామని.. ఇకపై ప్రతి నెలా రెండు, మూడు నోటిఫికేషన్లను జారీ చేస్తామని కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. కమిషన్ భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి కమిషన్ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎల్‌బి లక్ష్మీకాంత్ రాథోడ్, విశ్వ ప్రసాద్, డాక్టర్ అమీర్ ఉల్లాఖాన్, కార్యదర్శి హరితతో కలిసి ఛైర్మన్ బుర్రా వెంకటేశం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. నేడు(మంగళశారం) 3 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుందన్నారు. ఇకపై ప్రతి నెలా రెండు, మూడు నోటిఫికేషన్లను జారీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 3,800 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని ఛైర్మన్ స్పష్టం చేశారు. నేడు పొల్యూష్ కంట్రోల్ బోర్డులో 19 అసిస్టెంట్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పోస్టులు, రోడ్లు భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పోస్టులకి,అలాగే 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టులకి నోటిఫికేషన్లను జారీ చేయనున్నట్టు తెలిపారు. రాబోయే నోటిఫికేషన్లలో అత్యధికంగా అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు 1393 ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు ఈ నెలలోనే మరో మూడు నోటిఫికేషన్లను జారీ చేయనున్నట్టు తెలిపారు. విద్య శాఖలో ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈవో పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్టు తెలిపారు. వీటికి ఇంటర్వ్యూలు ఉండబోవని తెలిపారు. కేవలం డిగ్రీ లెక్చరర్ పోస్టులకు మాత్రమే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) నిబంధనల మేరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు తెలిపారు. భవిష్యత్తులో రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో భారీ సంస్కరణలు తీసుకొస్తున్నామని, ఇకపై జరగబోయే పరీక్షలన్నీ పారదర్శకంగా, >>7

# మన వాటా నీళ్లు వదలకండి

### ఎగువ రాష్ట్రాలతో సమన్వయం చేసుకోండి

### వర్షాలు వచ్చేలోగా డ్యామ్‌ల గేట్లు మరమ్మతులు చేయాలి

### పంటల మార్పిడిపై రైతుల్లో అవగాహన పెంచాలి

### వర్షాకాల సన్నద్ధత సమీక్షలో సిఎం రేవంత్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్1:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని వాతావారణ శాఖ నివేదిస్తున్నందున కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా జలాలు దక్కేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు డ్యామ్‌లు నిండిన తర్వాతే నీళ్ల వదిలే విధానాన్ని పాటిస్తే మనకు ఇబ్బందులు ఎదురవుతాయని సీఎం పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనేలా ఉన్నందున అంతరాష్ట్ర జలాల్లో ప్రోరేటా ప్రకారం తెలంగాణకు రావాల్సి న వాటా జలాలు వచ్చేలా ఆయా రాష్ట్రాల అధికారులతో ముందుగానే చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల వర్షాకాల సన్నద్ధతపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్రలోని కోయనా డ్యామ్ నీటిని వంద శాతం జల విద్యుదత్పత్తికే మహారాష్ట్ర వినియోగిస్తోందని... ఆ మొత్తం నీటిని మనం తీసుకొని వారికి అవసరమైన విద్యుత్ మనం సరఫరా చేసే దానిపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించాలని సీఎస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. గోదావరి నది నుంచి ఏటా వేల టీఎంసీల జలాలు సముద్రం పాలవుతున్నాయని, అయితే ఆ వరదంతా చాలా స్వల్ప కాలంలోనే వస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.. ఈ నేపథ్యంలో ఇటు గోదావరి, అటు ప్రాణహితల వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని సీఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నిర్మించిన సీలేరు, తుంగభద్ర డ్యామ్‌ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో తెలంగాణకు రావాల్సి న వాటాపై నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సీఎం ఆదేశించారు. డ్యామ్‌ల మెయింటెనెన్స్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. గతంలో కడెం ప్రాజెక్టులో తలెత్తిన ఇబ్బందులను సీఎం గుర్తు చేశారు. గేట్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లకు సంబంధించి ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఎన్ని నిధులు అవసరమైనా వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా డ్యామ్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనాలు, నివేదికల ఆధారంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను >>7

## రాయదుర్గంలో ఎకరం రూ.204 కోట్లు

### టిజిఐఐసి వేలంలో మరో వెయ్యి కోట్ల ఆదాయం



**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 1 ప్రభాతవార్త:** రాయదుర్గం భూములు ప్రభుత్వానికి భారీగా ఆధాయాన్ని సమకూరుస్తున్నాయి. గత గురువారం నిర్వహించిన వేలంలో ఒక ఎకరా 237 కోట్ల రూపాయల భారీ ధర పలికి రికార్డు సృష్టించగా, సోమవారం మరోసారి నిర్వహించిన వేలంలో ఒక ఎకరా 204కోట్లు పలికింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం సర్వే నెంబరు 83 నాలెడ్జ్ సిటీలోని ప్లాట్ నెంబరు 4ను టిజిఐఐసి సోమవారం ఈ వేలం >>7

## 4, 5 తేదీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్ 1:** ఈ నెల 4,5 తేదీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించ నున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించ నున్నారు. కర్ణాటక నీటి పారుదల శాఖ మంత్రి బోస్ రాజుతో కలిసి పర్యటించనున్న ముఖ్యమంత్రి, కొయిల్‌సాగర్, కృష్ణా, భీమా నదుల పరివాహక ప్రాంతాలు పరిశీలించనున్నారు. ప్రతిపాదిత బ్యారేజీల ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా వీక్షించనున్నారు.

## పవన్‌కల్యాణ్‌కు తెలంగాణలో ఏం పని?


### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రశ్న

### ఆంధ్రా నేతలు విద్వేషం చిమ్మినా బిఆర్ఎస్ మౌనం శోచనీయం

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** తెలంగాణపై విద్వేషం చిమ్మే పవన్ కళ్యాణ్‌కు తెలంగాణలో ఏం పని ఇక్కడ ఎందుకు సమావేశం పెడుతున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రశ్నించారు. దేశంలో ఎవరైనా ఎక్కడైనా రాజకీయపార్టీ పెట్టుకొనే హక్కు ఉందని పొరుగు రాష్ట్రం నేతలు తెలంగాణపై విద్వేషం చిమ్మితే ఊరుకునేదిలేదని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు.
ఆంధ్రనేతలు తెలం గాణపై పనిగట్టుకొని విషం చిమ్ముతుంటే ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు తీవ్ర కష్టాలకు గురవుతుంటే తెలం గాణలోని ఆంధ్ర ఉద్యోగులు స్వర్గంలో ఉన్నట్లు సుఖంగా ఉన్నారని వెంటనే తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తెప్పించుకొని ఆంధ్రా ఉద్యోగులను అక్కడికే పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

## 631 మంది పోలీసులకు రాష్ట్రావతరణ పతకాలు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** జూన్ రెండవ తేదీనాటి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతియేటా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే పోలీసు పతకాలు ఈ ఏడాది 631 మంది పోలీసులకు దక్కాయి. ఇందులో సిఎం శౌర్య పతకం పది మందికి దక్కాయి. వీరితో మహోన్నత సే వా పతకం 16 మందికి, ఉత్తమ సేవా పతకం 94 మందికి, కఠిన సేవా పతకం 50 మందికి, సేవా పతకం 461 మందికి దక్కాయి. రాష్ట్రా వతరణ పతకాలు అందుకున్న వారిలో శాంతి భద్రతలు, సాయుధ బలగం, ఎసిబి, ప్రత్యేక పోలీసు విభాగం, నిఘా విభాగం, ఎసిబి విభా గాలకు చెందిన వారున్నారు. కాగా రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా పతకాలు ఐదు రకాలుగా వుండగా మొదటిదయిన శౌర్యపతకం అందుకున్న వారికి 20 వేల రూపాయలతో పాటు నెలకు 500 రూపాయలు వేతనంతో పాటు అదనంగా చెల్లిస్తారు.
మహోన్నత పతకం అందుకున్న వారికి 40 వేల రూపాయలు, ఉత్తమ సేవా పతకం అందుకున్న వారికి 30 వేల రూపాయలు, కఠిన సేవా పతకం అందుకున్న వారికి 20 వేల రూపాయలు, సేవా పతకం అందుకున్న వారికి 20 వేల రూపాయలు చెల్లిస్తారు. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్య దర్శి శిఖాగోయల్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. కాగా పోలీసు పత కాలు అందుకున్న వారికి డిజిపి సి.వి.ఆనంద్ శుభాకాంక్షలు తెలిపారు. పోలీ సు శాఖలో వారు చేసిన కృషిని ఆయన కొనియాడారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న టిజెఎంయు నేతలు

## ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

### ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ దీక్షకు సిద్ధం

### తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 1, ప్రభాతవార్త:** ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అపాంటెడ్ డేట్‌ను తెలంగాన ఆవిర్భావ దినోత్స వం రోజు ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వ్యవ స్థాపక ప్రధాన కార్యదర్శి కే.హనుమంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం టీజేఎంయూ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో టీజీఎస్ ఆర్‌టీసీ ఉద్యోగుల మహాదీక్ష నిర్వహించారు. ఈ దీక్షనుద్దేసించి హనుమంతు ముదిరాజ్ మాట్లా డుతూ వివిధ జేఏసీ నేతలు కార్మికుల వద్ద ఒకమాట, ప్రభుత్వం ముందు ఒక మాట మాట్లాడుతున్నారని, అందుకే మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికలకు పోవాలంటున్నారని, ఇది కార్మికులకు వ్యతి రేకమని స్పష్టం చేశారు. వేరే యూనియన్ నేతలు కార్మిక వ్యతిరేక విధానాలతో ప్రభుత్వాన్ని, కార్మికులను తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనంపై స్పష్టమైన ఆమోదంతో గెజెట్‌లో కూడా ప్రకటించింది కానీ అపాంటెడ్ డేట్‌ను ప్రకటించలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, జూన్ 2న అపాంటెడ్ డేట్‌ను ఆర్టీసీకి వరంగా ప్రకటించాలని, లేనిపక్షం తాను ఆమరణ దీక్ష చేపడతానని ప్రకటించారు. ఈ దీక్షా కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు డి.వి.కే. రావు, ఉపాధ్యక్షులు గోలి రవీందర్, వి.స్వాములయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ఎస్.ఎస్.రావు, బుల్లెట్ పాండు, పీకే.మూర్తి, నరేందర్ తదితర నేతలు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల స్వప్నం సాకారం చేసిన సోనియాగాంధీ

### తెలంగాణ 13వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు : పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల అరవై యేళ్ల స్వప్నంను సోనియాగాంధీ సాకారం చేయడంతో స్వరాష్ట్రం లో సగర్వంగా బ్రతుకుతున్నామని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో ప్రజలకు తెలంగాణ 13వ ఆవిర్భావ దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపమని, అనేక త్యాగాలు, పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, మేధావులు సహా అన్ని వర్గాల ప్రజలు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని అమర వీరుల త్యాగాలకు చలించిన తల్లి సోనియమ్మ కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం జరిగినా కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకొని తెలంగాణ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో మరింత అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య విలు వలు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి అనే తెలంగాణ ఉద్యమ ఆశయాలను సాకారం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేం దుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కెసిఆర్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ (జూన్ 2) పర్వదినాన్ని పురస్కరించుకుని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను కేసీఆర్ స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతి యుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించు కున్నామని తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిలా మార్చుకున్నామని, పరిపాలన చేతగాదు అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని కేసీఆర్ అన్నారు. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నామని వివరించారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, విద్య వైద్యం తదితర సంక్షేమ రంగాల్లో తెలంగాణ సాధించిన ప్రగతి నేడు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచిందనీ, ఒకనాడు ఎడారిలా మారిన తెలంగాణను, నేడు కోటి ఎకరాల మాగాణంగా మార్చి, అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత నాటి పదేండ్ల బిఆర్ ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని కేసీఆర్ తెలిపారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ హెచ్చరించారు. ప్రతీప శక్తులనుండి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని కేసీఆర్ అన్నారు.

# విప్ యెన్నం, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వాంగ్మూలం

### ట్యాపింగ్ ద్వారా బిఆర్ఎస్ సర్కారు ప్రజల హక్కులను కాలరాసింది: యెన్నం

### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి న కేసులో మరో కీలక పరిణామం చోటు చే సుకుంది. ఈ కేసులో బాధితులుగా వున్న ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎంఎల్ఎ అనిరుధ్‌రెడ్డి సోమవారం సిట్ అధికారులకు నాటి ఘటనలపై వాంగ్మూలం ఇచ్చారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల సిట్ కార్యాలయంలో ఈ కేసును విచారిస్తు న్న ఎసిపి వెంకటగిరి ఎదుట యెన్నం శ్రీనివాస్ రెడ్డి, అనిరుద్ద్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం యెన్నం శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడు తూ బిఆర్ఎస్ సర్కారు ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రజలకు రాజ్యాంగ పరంగా వచ్చిన అన్ని హక్కులను హరించి వేసిందని ధ్వజమె త్తారు. ఇది వ్యక్తిగత అంశం ఎన్నటికీ కాదని నాటి బిఆర్ఎస్ సర్కారు దమనకాండకు ఉదాహరణగా ఆయన తెలిపారు. అప్పట్లో తన ఫోన్‌తో పాటు తన కుటుం బ సభ్యుల ఫోన్‌లపైనా నిఘా వుంచారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ట్యాపింగ్ భూ తం కోరలు చాచిందని జర్నలిస్టులు, జడ్జిల సహా ప్రముఖుల ఫోన్‌లను సైతం ట్యాపింగ్ చేశారని ఆయన మండిపడ్డారు. అప్పట్లో దీనిపై తా ము ఎంత చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని, ఆఖరుకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక ఫోన్ ట్యాపింగ్‌పై అన్ని కోణాల్లో విచా రించాలని డిజిపిని కోరామని యెన్నం తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఆర్టికల్ 14, 19ల ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ నేరానికి పాల్ప డిన వారిని కఠినంగా శిక్షించాల్సిందేన ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కేసులో జూన్ నెలలో ఛార్జిషీట్ దాఖలు చేస్తా మని సిట్ అధికారులు తనకు హామీ ఇచ్చారని యెన్నం తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో నలుగుర వ్యక్తుల భవిష్యత్తు కోసం నాటి బిఆర్ఎస్ సర్కారు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ఆయన తెలిపారు.



కమాండ్ కంట్రోల్‌లో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ అధికారులకు వాంగ్మూలం ఇచ్చేందుకు వచ్చిన విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎంఎల్ఎ అనిరుధ్‌రెడ్డి.

# ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్ 2026లో తిరుగులేని శక్తిగా శ్రీచైతన్య

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026 పరీక్షలో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తమ అపూర్వ ప్రతిభను చాటుకున్నాయి. సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026 ఫలితాల్లో సౌతిండియా




నెం.1 శ్రీచైతన్యయే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 4వ ర్యాంక్ మోహిత్ ఎస్ఎస్, తెలంగాణ బెస్ట్ ర్యాంక్ శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థిదే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 9వ ర్యాంక్ ఎం నాగ సహర్ష, ఆంధ్రప్రదేశ్ బెస్ట్ ర్యాంక్ శ్రీచైతన్య విద్యార్థిదే. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10వ ర్యాంక్ దర్శ్ సిక్కాతోపాటు టాప్10లోపు 3 ర్యాంకులు. టాప్100లోపు 4, 9, 10, 17. 21, 26, 28, 30, 31, 36, 37, 38, 40, 41, 44, 45, 52, 56, 59, 62, 64, 66, 67, 72, 73, 74, , 79, 81, 87, 91, 92, 93, 95, 98, 99 ర్యాంకులతో టాప్ 100లో 35కు పైగా ర్యాంకులు, అలాగే టాప్ 1000లో 196కు పైగా ర్యాంకులు సాధించి తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించారు.ఇదే విజయ పరంపరను కొనసాగిస్తూ, జేఈఈ మెయిన్ 2026లో కూడా శ్రీచైతన్య విద్యార్థులు 300/300 పరిపూర్ణ మార్కులతో రెండు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులను సాధించారు. అదేవిధంగా టాప్ 100లో 27 ర్యాంకులు, టాప్ 1000లో 166 ర్యాంకులు సాధించి అసాధారణ ప్రతిభను కనబరిచారు.ఈ అద్భుత విజయాల సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకాడెమిక్ డైరెక్టర్ సీఈఓ సుష్మ బొప్పన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, పరిపాలనా సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "శ్రీచైతన్యలో అమలు చేస్తున్న వినూత్నమైన పరిశోధనాధారిత శాస్త్రీయ విద్యా కార్యక్రమాలు, అత్యున్నత స్థాయి అకాడెమిక్ ప్రణాళికలు, విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావం, పరిపాలనా బృందం సమిష్టి కృషి ఫలితంగానే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయి. జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వరుసగా సాధిస్తున్న ఈ అసాధారణ ఫలితాలు మా విద్యా విధానాల ప్రభావాన్ని, నాణ్యతను, నిరంతర శ్రేష్ఠత సాధనను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఐఐటీ మద్రాస్ జోన్ లో టాప్ 500 లోపు 50 పైగా ర్యాంకులు శ్రీ చైతన్యనే కైవశం చేసుకుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారతదేశంలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల రంగంలో శ్రీచైతన్య మరోసారి తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అత్యుత్తమ ఫలితాలతో విజయపథంలో ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు.

## గచ్చిబౌలి జనసేన సభకు పోలీసుల అనుమతి నిరాకరణ

### కోర్టును ఆశ్రయించిన ఆ పార్టీ నాయకులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 1, ప్రభాతవార్త:** జనసేన పార్టీ గచ్చిబౌలిలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన సభకు ఎదురుదెబ్బ తగిలింది. భద్రతా కారణాలతో జనసేన సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో జనసేన నాయకులు కోర్టును ఆశ్రయించారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జూన్ 2వ తేదీన నగరంలోని గచ్చిబౌలిలో గల సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో 'తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ - జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో సభ నిర్వహించేందుకు ప్రణాళిక రచించారు. ఈ సభ కోసం పోలీసుల అనుమతికి జనసేన నాయకులు దరఖాస్తు చేసుకోగా, సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉండడంతో భద్రతా బలగా లన్నీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఉంటాయని, అదే రోజు సభ నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యలు, శాంతిభద్రతల సమస్యలు ఏర్పడు తాయంటూ సైబరాబాద్ పోలీసులు ఈ సభకు అనుమతి నిరాకరించారు. కాగా పోలీసుల నిర్ణయంపై జనసేన నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. జనసేన సభకు అనుమతి ఇవ్వాలంటూ పిటీషన్ దాఖలు చేశారు. మరోవైపు గతకొని న్ని రోజులుగా తెలంగాణలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతతో పోలీసులు ముందు జాగ్రత్తగా ఈ సభకు అనుమతి నిరాకరించినట్లు తెలుస్తుంది. తెలంగాణ ఆవి ర్భావ దినోత్సవం రోజే జనసేన సభ నిర్వహించేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగి శాంతిభద్రతల సమస్య ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు ముందు జాగ్రత్తగా సభకు అనుమతి నిరాకరించినట్లు సమాచారం. కాగా జనసేన సభ నిర్వహణపై కోర్టు తీర్పు ఏ విధంగా ఉంటుందోనని ఉత్కంఠ నెలకొంది.

## సింగరేణిలో 113 మంది అధికారుల బదిలీ

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్‌లో భారీగా అధికార్ల బదిలీలు జరిగాయి. సింగరేణి వ్యాప్తంగా పలువురు మైనింగ్, మెడికల్, పర్సనల్ విభాగాల అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న మొత్తం 113 మంది మైనింగ్ ఆఫీసర్లను బదిలీ చేసింది. వీరిలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌లు (డీజీఎం), మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు (ఏఎమ్), అండర్ మేనేజర్లు, సీనియర్ మేనేజర్లు ఉన్నారు.
అలాగే పర్సనల్ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ నుంచి పర్సనల్ మేనేజర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ (డీవైపీఎం), సీనియర్ పర్సనల్ ఆఫీసర్ (పీవో) స్థాయి వరకు 30 మంది అధికారులను సింగరేణి యాజమాన్యం బదిలీ చేసింది. వీటరితో పాటు, మెడికల్ విభాగంలోనూ పలువురు వైద్యుల బదలీలను చేసింది.

## ప్రశాంతంగా ముగిసిన పిజి ఇసెట్ పరీక్షలు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** ఇంజినీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవే శాల కోసం నిర్వహించే పీజీ ఈ సెట్-2026 పరీక్షలు సోమవారంతో ప్రశాం తంగా ముగిశాయి. ఈ నెల 29న ప్రారంభమైన పరీక్షలు సోమ వారం(జూన్1)తో ముగిశాయి. నాలుగు రోజులపాటు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పీజీ ఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ కె వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం పీజీ ఈసెట్ పరీక్షలనను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొదటి రోజు పరీక్షలకు 88 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండో రోజు పరీక్షలకు 78 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడో రోజైన ఆదివారం జరిగిన పరీక్షలకు 67.70 శాతం మంది హాజరయ్యారు. చివరి రోజైన సోమవారం పరీక్షలకు 90.64 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు కన్వీనర్ తెలిపారు. మొత్తం 19 పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 26,085 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం సెషన్‌కి 61.19 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని పీజీ ఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌కి 74.55 శాతం మంది హాజరయ్యారని తెలిపారు.

## ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్- 2026లో డాక్టర్ కెకెఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి ఆలిండియా 9వ ర్యాంకు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్- 2026లో డాక్టర్ కెకెఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి ఆలిండియా 9వ ర్యాంకు సాధించాడు. సోమవారం విడుదలైన జేఇఇ అడ్వాన్స్‌డ్- 2026 పోటీ పరీక్ష ఫలితాలలో డాక్టర్ కెకెఆర్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యార్థులు వివిధ కేటగిరీలలో మొదటి 100లోపు 16 ర్యాంకులు సాధించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరిలో పసల మోహిత్ 26వ ర్యాంకు, బిజ్జం వెంకట చంద్రశేఖర్ రెడ్డి 38వ ర్యాంకు, చిన్న పవన్ తేజ 56వ ర్యాంకులతో పాటు 9, 22, 22, 24, 26, 31, 35, 38, 46, 49, 55, 56, 74, 79, 80, 80 సాధించారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది.




## జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రెసోనెన్స్ విజయ కేతనం

### వందలాది మంది విద్యార్థులకు ఐఐటి సీట్లు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026 ఫలితాలలో రెసోనెన్స్ జూనియర్ కాలేజీలు విజయ కేతనం ఎగుర వేశాయి. ఓపెన్, ఇతర కేటగిరీలలో పదిహేడు మంది విద్యార్థులు వెయ్యి లోపు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. రెసోనెన్స్ వివిధ క్యాంపస్‌ల నుంచి 185 మందికి పైగా విద్యార్థులు దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలలో ప్రవేశాలు పొందనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెసోనెన్స్ విద్యా సంస్థల డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థుల ప్రదర్శన అద్భుతమన్నారు. ఇది వారి కష్టాన్ని, సబ్జెక్టుపై ఉన్న స్పష్టతను, రాణించాలన్న పట్టుదలను ప్రతిబిం బిస్తుందన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ఫ్యాకల్టీ, అకడమిక్ బృందాలు విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, ప్రాక్టీస్, ప్రేరణను అందించాయన్నారు. భవిష్యత్తు ఐఐటియన్లను తీర్చిదిద్దేలా ప్రయాణాన్ని కొనసాగించడానికి ఈ ఫలితాలు మాకు మరింత స్ఫూర్తిని ఇచ్చాయన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో మరొక విజయవంతమైన సంవత్సరంతో, ఐఐటీ జేఈఈ కోచింగ్‌లో అగ్రగామి సంస్థలలో ఒకటిగా తన ఖ్యాతిని మరింత బలోపేతం చేసిందన్నారు.
ఓపెన్ కేటగిరీ, వెయ్యిలోపు టాప్ ర్యాంకర్లు అభినవ్ చిట్టూరి 11వ ర్యాంకు, గంటా ప్రజేష్ 94వ ర్యాంకు, సపవత్ పావన సమీక్ష 105వ ర్యాంకు, శెట్టిపల్లి అన్వితరెడ్డి 190వ ర్యాంకు, చీర మనస్విని 273వ ర్యాంకు, బదావత్ అక్షిత్ 315వ ర్యాంకు, బోర్నెల్ హర్షిత్ కుమార్ 397వ ర్యాంకు, బునేటి ఆదిత్యరెడ్డి 435వ ర్యాంకు, పవార్ కరణ్ పాండు 602వ ర్యాంకు, ఆదిత్య కృష్ణ వర్రే 790వ ర్యాంకు, మంద సాత్విక్ 803వ ర్యాంకు, తిష్య ఈశ్వర్ కొంకటి 804వ ర్యాంకు, సమృద్ధ్ భట్టాచార్య 889వ ర్యాంకు, రేవంత్ వంగాల 956వ ర్యాంకు, ప్రేమ్ కుమార్ కె 959వ ర్యాంకు, బోడ ప్రీతం 960వ ర్యాంకు, సాకేత్ రెడ్డి బొమ్మిడి 990వ ర్యాంకు.

# జెఇఇ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాల్లో ఆలిండియా టాప్ 20లో 6 ర్యాంక్‌లతో నారాయణ ఆధిక్యం

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్- 2026 ఫలితాలలో నారాయణ విద్యార్థులు టాప్ ర్యాంకులతో మరోసారి సత్తాచాటారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో కుచి సందీప్ 5 వ ర్యాంక్, మను పరమేశ్వరన్ 13 వ ర్యాంకు, ప్రిన్స్ చౌదరి 14 వ ర్యాంక్, వెల్దుర్తి హర్షిత్ 15 వ ర్యాంక్, తనయ్ అగర్వాల్ 16 వ ర్యాంకు, అనీష్ ముప్పాల 20 వ ర్యాంక్‌తో టాప్ 20 ర్యాంకుల్లో 6 ర్యాంకులు నారాయణ కైవశం చేసుకుంది. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 22, 23, 24, 27, 35, 39, 41, 44, 51, 54, 57, 58, 60, 61, 63, 71, 72, 75, 78, 79, 80, 83, 84, 89, 98,99, 100 100 5 35, 500 5 133 ర్యాంకులు, 1000 లోపు 217 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి. సింధూర నారాయణ పి. శరణినారాయణ తెలిపారు. అలాగే ఆలిండియా అన్ని కేటగిరీల్లో ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 2, 4, 5, 6, 6, 7, 9 వంటి 10 లోపు 16 ర్యాంకులు, 50 లోపు 69 ర్యాంకులు, 100 లోపు 147, 500 లోపు 540, 100 లోపు 894 ర్యాంకులను కైవసం చేసుకుని ఐఐటి ఆశయాలను సాకారం చేయటంలో వేరెవ్వరూ నారాయణకు సాటిలేరని, సాటిరారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 190000 మందికి పైగా విద్యార్థులు పోటీపడిన ఈ పరీక్షా ఫలితాలలో అత్యధిక సంఖ్యలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారని పేర్కొన్నారు. ఈ




సందర్భంగా డాక్టర్ పి. సింధూర నారయణ మాట్లాడుతూ.. ఈ అద్భుతమైన విజయానికి కుచి సందీప్ నాయకత్వం వహించాడని పేర్కొన్నారు. కుచి సందీప్ ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా 5 వ ర్యాంక్ సాధించాడని తెలిపారు. హైదరాబాద్‌కి చెందిన సందీప్, నారాయణ స్కూల్స్‌లో 10వ తరగతి, నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివినట్లు చెప్పారు. అతను ఒలింపియాడ్ స్వర్ణ పతక విజేత కూడా. అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్ 2025లో స్వర్ణ పతకం గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచాడు. ఇప్పుడు ఉజ్బెకిస్తాన్లో జరగనున్న అంతర్జాతీయ రసాయన శాస్త్ర ఒలింపియాడ్ 2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి మరోసారి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.
నారాయణలో అనితరసాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్‌లు, మైక్రోషెడ్యూల్, బెస్ట్ స్టడీమెటీరియల్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్, టాప్ ఫ్యాకల్టీతోనే ఇంతటి ఘనవిజయానికి కారణాలని తెలిపారు. 8వ తరగతి నుండే జేఈఈకి అవసరమైన శిక్షణ అందించటంతోపాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు.
పరీక్షల్లో ఎలాంటి క్లిష్టమైన ప్రశ్నలు వచ్చిన తక్కువ సమయంలో సరైన సమాధానం గుర్తించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. డైరెక్టర్ శరణి నారాయణ మాట్లాడుతూ ఎన్‌లెర్న్ యాప్ ద్వారా ఛాప్టర్ వైజ్ ప్రాక్టీస్ టెస్టులు, ఆన్‌లైన్ మాక్ టెస్టులు నిర్వహించటం వల్లనే నారాయణ విద్యార్థులు ఇంతటి ప్రతిభాపాఠవాలను ప్రదర్శించగలిగారని తెలిపారు. ఈ విధానాల వల్లే తెలుగు రాష్ట్రాల నుండి అత్యధిక విద్యార్థులు, జాతీయస్థాయిలో నారాయణ నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఐఐటిల్లోకి ప్రవేశిస్తున్నట్లు పేర్కొన్నారు. టాప్ ర్యాంకులు సాధించిన వారికి అత్యధిక సంఖ్యలో నారాయణ స్కూల్స్ చదివిన విద్యార్థులే ఉన్నారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలిపారు.



రాజస్థాన్‌లోని కిషన్‌గఢ్ విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి స్వాగతం పలుకుతున్న పార్టీ సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లాట్

## బదలీలపై మళ్లీ నిషేధం

>> ఇవ్వబడదని స్పష్టం చేసింది. అటువంటి అన్ని సందర్భాలలో, ఇతర ఉద్యోగులను బదిలీ చేయకుండా, ప్రస్తుతం ఉన్న ఖాళీలలో మాత్రమే పోస్టింగ్‌లు చేయాల్సి ఉంటుంది. ఆరు నెలల కాలం పాటు ఎలాంటి సడలింపు ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోబోమని ప్రభుత్వం ఆదేశించింది. భవిష్యత్తులో ఇచ్చే ఏ సడలింపుకైనా సరైన ప్రక్రియ ద్వారా ముఖ్యమంత్రి ఆమోదం పొందాల్సి ఉంటుందని వెల్లడించింది. అంతేకాకుండా, ఆర్థిక శాఖ నుండి సరైన సమర్థన, ఆమోదంతో, తమ ప్రస్తుత పోస్టింగ్‌లో కనీసం ఒక సంవత్సరం సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులతో మాత్రమే ఖాళీలను భర్తీ చేయాలని అన్ని ప్రభుత్వ శాఖలకు సూచించడం జరిగింది. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించి బదిలీ అయిన ఉద్యోగుల జీతభత్యాల బిల్లులను ప్రాసెస్ చేయబోమని కూడా ఉత్తర్వులో పేర్కొనబడింది. అన్ని విభాగాలు మరియు కార్యాలయాల అధిపతులు ఈ సూచనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించింది.

## రాయదుర్గంలో ఎకరం రూ.204కోట్లు

>> నిర్వహించింది. మొత్తం 5ఎకరాల 9 గుంటల భూమిని వేలం వేయగా, ఈ వేలంలో ఒక ఎకరా 204కోట్ల రూపాయల ధర పలికింది. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి దాదాపు 1వెయ్యి కోట్ల ఆదాయం సమకూరింది. గత గురువారం ఇదే సర్వే నెంబరులోని 6 ఎకరాల 29 గుంటల భూమికి వేలం నిర్వహించగా ఒక ఎకరా 237 కోట్ల భారీ ధర పలికి రికార్డులు స ృష్టించింది. గురువారం నిర్వహించిన వేలం ద్దారా ప్రభుత్వానికి 1490కోట్ల ఆధాయం సమకూరగా, తాజాగా సోమవారం నిర్వహించిన వేలంతో మరో 1వెయ్యి కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో రాయదుర్గం భూముల వేలం ద్వారా ప్రభుత్వానికి దాదాపు 2500కోట్ల ఆదాయం సమకూరింది. ప్రభుత్వం 2వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ 2500కోట్ల ఆదాయం రావడం విశేషం.

## మయన్మార్ శాంతి చర్చలకు భారత్ సంపూర్ణ మద్దతు

>> మరింత బలోపేతం లక్ష్యంగా సమాలోచనలు సాగాయి. ఇరు పొరుగు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి అంగీకరించారు. ఈ సమావేశంలో, సమాఖ్య పాలన, ఆర్థిక వృద్ధి అనుభవాలను పంచుకోవడంతో సహా, మయన్మార్‌లో శాంతి, సంప్రదింపులకు మద్దతు ఇచ్చేందుకు భారతదేశ సంసిద్ధతను ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. సుదీర్ఘ చారిత్రక, ప్రజల మధ్య సంబంధాలకు శాంతి, పురోగతి, శ్రేయస్సు కోసం భారత్-మయన్మార్ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, అలాగే వాణిజ్యం, పెట్టుబడులు, అనుసంధానం, అభివృద్ధి భాగస్వామ్యం, సామర్థ్య నిర్మాణం, భద్రత, సరిహద్దుల నిర్వహణ వంటి రంగాలలో మరింత సహకరించుకోవడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. భారతదేశం మయన్మార్‌కు విశ్వసనీయ పొరుగు దేశంగా, నమ్మకమైన భాగస్వామిగా, సంక్షోభ సమయాల్లో దృఢమైన ప్రథమ స్పందనదారుగా నిలుస్తుందని ప్రధాని తెలియజేశారు. సమాఖ్య పాలన, ఆర్థిక వృద్ధి అనుభవాలను పంచుకోవడంతో సహా, మయన్మార్‌లో శాంతి, సంప్రదింపులకు మద్దతు ఇవ్వడానికి భారతదేశం సిద్ధంగా ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. "భారతదేశం నైబర్‌హుడ్ ఫస్ట్, యాక్ట్ ఈస్ట్, మహాసాగర్ విధానాల సంగమ స్థానంలో మయన్మార్ ఉంది. అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్ అధికారిక భారత పర్యటన ఇరు దేశాల మధ్య బహుముఖ సంబంధాలను మరింత బలోపేతం చేసి, గాఢతరం చేస్తుందని భావిస్తున్నాము" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ముందస్తు ప్రణాళికలు

### శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

**నస్పూర్, జూన్ 1, ప్రభాతవార్త:** యాజమాన్యం నిర్దేశించిన 64 లక్షల 30 వేల టన్నుల వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు ముందస్తు ప్రణాళికలతో కృషి చేస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మే నెలలో ఏరియాలోని గనుల ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. మే నెల లక్ష్యం 5,47,500 టన్నులు కాగా, 3,16,447 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి 58 శాతం ప్రగతి సాధించినట్లు వివరించారు.

భూగర్భ గనులు 96 శాతం ఉత్పత్తి సాధించగా, ప్రైవేట్ కాంట్రాక్ట్ సమస్యల వల్ల ఓపెన్ కాస్ట్ గనులు 47 శాతానికే పరిమితమయ్యాయన్నారు. జూన్ 3 నుండి కొత్త కాంట్రాక్ట్ పనులు ప్రారంభం కానుండటంతో ఓసీల్లో ఉత్పత్తి పెరగనుందని, ఐకే ఓసీ టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. గనుల వారీగా క్షేత్రస్థాయిలో ఉత్పత్తి పెంచేందుకు ఏప్రిల్ 18 నుండి 23 వరకు మల్టీ డిపార్ట్‌మెంటల్ (ఎండీటీ) సమావేశాలు నిర్వహించి, సంస్థ మనుగడ కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరినట్లు వివరించారు. కారుణ్య నియామకాల ద్వారా మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులు 3,896 మందికి ఉద్యోగాలు కల్పించామని జనరల్ మేనేజర్ వెల్లడించారు. 283 మందికి ఎల్‌ఎస్‌పీ, 23 మందికి ఎంఎంసీ చెల్లింపులు పూర్తి చేశామని, విశ్రాంత ఉద్యోగులు 9,757 మందికి సిపిఆర్‌ఎమ్‌ఎస్ మెడికల్ కార్డులు అందజేశామని చెప్పారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఉదయం నిర్వహించే తెలంగాణ రన్, సాయంత్రం ప్రగతి స్టేడియంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం(పర్స నల్) ఎస్. అనిల్ కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, సీనియర్ పీఓ ఎస్ . సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గేతో భట్టి భేటీ

### జార్ఖండ్ రాజకీయ పరిణామాలపై ఏఐసిసి అధ్యక్షునికి నివేదిక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్1:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సోమవారం ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఇటీవల జార్ఖండ్ పర్యటనకు వెళ్లిన భట్టి విక్ర మార్క.. అక్కడ తాను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణా మాలను ఈ సందర్భంగా ఖర్గేకు నివేదిం చారు. జార్ఖండ్‌లో త్వరలో జరగబోయే రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో తాను జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏఐసీసీ అధినేతకు వివరిం చారు. రాజ్యసభ ఎన్నికల్లో ఇండి కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆయన ఖర్గే దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగడంపై జార్ఖండ్ స్థానిక నాయ కత్వంతో జరిపిన సంప్రదింపులను భట్టి విక్రమార్క ఈ సందర్భంగా ప్రస్తావించారు. కూటమి ఐక్యతను చాటేలా జార్ఖండ్ కాంగ్రెస్ నేతలు శ్రమిస్తున్న తీరును ఆయన ఏఐసీసీ అధ్యక్షునికి వివరించారు.

## 'సుప్రీం'కు మరో ఐదుగురు జడ్జిలు

>> ఉంది. నియమితులైన వారిలో, వెంకట సుబ్రమణి మోహన నేరుగా సుప్రీం కోర్టు బెంచ్‌కు పదోన్నతి పొందిన కొద్దిమంది సీనియర్ న్యాయవాదులలో ఒకరిగా నిలిచారు. నియమితులైన మిగిలిన నలుగురు దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టులలో ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేస్తున్నారు.

## వారం - వర్జ్యం

02-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
విదియ రా.7.01
మూల రా.10.06
వర్జ్యం : రా.8.18-రా.10.06
దు.ఉ.8.10-ఉ.9.02,2) రా.11.50-రా.12.42
శుభసమయం : ఉ.10.00-10.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** మీరు లాభము వస్తుందని చేపట్టిన వ్యాపారములో నష్టములను చవి చూడవలసి వస్తుంది. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**వృషభం:** మీ వృత్తి యందు చేసిన పొరపాటుకు సంజాయిషీలను చెప్పుకోవలసి రావచ్చును. ఆరోగ్యం విషయం జాగ్రత్త.

**మిథునం:** గోష్ఠులకు, చర్చలకు, పరిష్కారములకు, సంప్రదింపులకు అత్యంత లాభదాయకం. శుభ ఆహ్వానాలు అందుతాయి.

**కర్కాటకం:** గృహావసరములకు, శారీరక సౌఖ్యమునకు కొన్ని విలువైన వస్తువులను ఏర్పరచుకుంటారు. వాహనసౌలభ్యం.

**సింహం:** ఆలోచనలను ప్రక్కనపెట్టి, మీ దైనందిన కార్యక్రమముల మీదనే దృష్టిని సారిస్తారు. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**కన్య :** ఆధ్యాత్మిక కార్యక్రమములకు, శుభకార్యములకు, ధనమును బాగా ఖర్చు చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శనం.

**తుల :** నూతన వ్యవహారము లుండగలవు. కొత్త వ్యక్తులను కలుస్తారు. కొత్త ప్రదేశములకు సందర్శిస్తారు.

**వృశ్చికం:** దైవ సంబంధిత విషయములు సంతృప్తికరంగా ఆచరిస్తారు. ఉద్యోగము వంటి ముఖ్యమైన విషయాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలకు సంబంధించి నిర్ణయాత్మక చర్చలు జరుగుట, సుదీర్ఘమైన లేఖలు వస్తాయి.

**మకరం:** మిమ్ములను వ్యతిరేకించ - స్త్రీలు ఆకస్మికముగా మీకు అనుకూలముగా మారుట అమిత ఆశ్చర్యము కలిగిస్తుంది. వాహనసౌఖ్యం.

**కుంభం:** కొత్త వ్యాపార, విద్యా సంబంధిత మైన విషయములకు గృహ కార్యక్రమాలు ప్రారంభించుటకు అనుకూలం.

**మీనం :** ప్రజా సంబంధముల వృద్ధిని ఒక ఉద్దేశ్యములో ప్రారంభిస్తే అది వేరొక మలుపు తిరుగుతుంది. వస్త్ర లాభం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తాండాల్లోనూ పక్కా ఇళ్లు

>> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమం తొలత ఇక్కడి నుండే ప్రారంభించి శ్రీకారం చుట్టినట్లు సీఎం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదివరకే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని ఇందులో భాగంగా నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉంటే ఆదివాసుల పటేల్ విన్నపాన్ని స్వీకరించి మరో 21వేల ఇందిరమ్మ ఇండ్లు ఆదివాసీలకు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇవే కాకుండా ఇక నుండి ప్రతీ గూడెం , తండాలలో ఐటీడీఏ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి గుడిసె ఉన్న ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి తీరుతామని ప్రత్యేకంగా తండాలు, గూడెంలలోని ఆదివాసుల కోసం మరో 30 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. రెండో విడతలో భాగంగా నూతనంగా 2.5 లక్షల ఇండ్లు మంజూరు చేస్తూ వేదిక నుండి ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కాగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గుండి, అనర్‌పల్లి ప్రాజెక్టుల విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

**తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదు**

గత ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తూ కాలేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం ప్రాజెక్టు కావడంతో లక్షల కోట్ల ప్రజాధనం వృధా అవడం జరిగిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఎలాగైనా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి నిర్మాణం చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని ముంపుకు గురవుతున్న భూమి సేకరణకు మహారాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖ రాసినప్పటికిని దేవేంద్ర పడ్నావిస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఎం అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే హరీష్‌బాబు చొరవ చూపి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి చర్చల ద్వారా పరిష్కారం అయ్యే విధంగా చూసి ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని అన్నారు. మహారాష్ట్రలోని ముంపు ప్రాంతంలో సుమారు 2 వేల ఎకరాలు భూ సేకరణ చేపట్టి మహారాష్ట్ర ప్రభుత్వం వాటి విలువ ఎంతో ప్రకటిస్తే అంత చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం అన్నారు.

**ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

రాష్ట్రంలో రైతులు ఎవరు ధాన్యం కొనుగోలు విషయంలో అధైర్యపడవద్దని, తడిసి ప్రతీ గింజను సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రజా ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 75లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం 20 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం సిద్ధంగా ఉన్నట్లు, ఇవే కాకుండా జొన్నలు, పొద్దుతిరుగుడు పువ్వు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. కానీ కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదని, మద్దతు ధర సైతం ప్రకటించడం లేదని కేంద్ర ప్రభుత్వం ఇదే ధోరణితో కొనసాగితే జూన్ 15 తర్వాత కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఒత్తిడి తెచ్చేందుకు కార్యచరణ ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డి, పెద్దపల్లి ఎంపి వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కోవలక్ష్మి, హరీష్‌బాబు, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మాజీ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపి సోయం బాబురావు, నాయకులు ఆత్రం సక్కు, పురాణం సతీష్, వేణుగోపాల చారి, అజ్మీర రేఖ, శ్యామ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మన వాటా నీళ్లు వదలకండి

>> ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంటలు, పంట రకాల సాగుపై రైతులకు రైతు వేదికల నుంచి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఈ విషయంలో ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించాలని సీఎం తెలిపారు. టీవీ ఛానెళ్లలోనూ ఇందుకు సంబంధించిన ప్రసారాలు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పంటల సాగుతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరాలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రామగుండం ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతేడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో తాను క్షేత్ర స్థాయిలో పర్యటించిన సమయంలో ఇచ్చిన హామీల అమలుపై అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నాడు ఇచ్చిన హామీలు.. వాటి ప్రస్తుత పరిస్థితి.. ఏవైనా నెరవేరకుంటే అందుకు కారణాలతో తనకు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. హామీల అమలులో నిరక్ష్ యప్పూరితంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విపత్తుల సమయంలో విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం సూచించారు. వడగాలులు, వరదల సమయంలో ప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోయినప్పుడు వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు. వరదల సమయంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం, ఇతర పనులకు విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000 కోట్లను నిబంధనల ప్రకారం వ్యయం చేయాలని సీఎం సూచించారు. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్షాకాలంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నీరు నిలిచే 141 ప్రదేశాలను గుర్తించి వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని గతంలో నిర్ణయించామని, వాటి పురోగతిపై ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే 11 వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పూర్తి చేశామని, మిగతా వాటి పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని.. వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షి ంచాలని సీనియర్ అధికారి జయేశ్ రంజన్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో నగరంలో సమస్యల పరిష్కారానికి ముగ్గురు కమిషనర్లు, మూడు నగరాల పోలీస్ కమిషనర్ల సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఏ ప్రాంతాలోనూ తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు సీఎంకు తెలియజేశారు. పరిస్థితికి తగినట్లు తాగు నీరు, విద్యుదుత్పత్తి, సాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కేటాయింపులు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ వర్షాకాలానికి అవసరమైన సామగ్రిని ముందుగానే సమీకరించుకోవాలని సీఎం సూచించారు. గాలిదుమ్ములు, భారీ వర్షాలతో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నప్పుడు, లైన్లు తెగిపోయి సరఫరా నిలిచినప్పుడు తక్షణమే స్పందించి మరమ్మ తులు పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. జిల్లాల స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలు నిర్ణీత సమయం లో భేటీ అవుతూ ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో ముందుకు సాగితే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా, మండల స్థాయిలోనూ రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని సీఎం అన్నారు. సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, డీజీపీ సి.వి.ఆనంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు సందీప్ కుమార్ సుల్తానియా, వికాస్ రాజ్, దాన కిశోర్, టి.కె.శ్రీదేవి, ఏ.వి.రంగనాథ్, నవీన్ మిట్టల్, సురేంద్ర మోహన్, క్రిస్టినా జోంగ్తూ, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమవారం గురుగ్రామ్‌లో అత్యవసర ప్రతిస్పందన వాహనాల ప్రారంభించిన అనంతరం ర్యాలీ నిర్వహిస్తున్న హర్యానా పోలీసులు

## ప్రతినెలా జాబ్ నోటిఫికేషన్లు

>> లీకేజీలకు తావు లేకుండా పూర్తి స్థాయిలో కంప్యూటర్ విధానంలోనే (సీబీటీ) నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రం ఒక రోజు ముందు, లేదంటే అదేరోజు పరీక్షకు కొన్ని గంటల ముందుగానే ప్రశ్నాపత్రంను సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇలా చేయడం వల్ల అక్రమాలు జరిగే అవకాశం ఉండబోదన్నారు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష నిర్వహణ చాలా క్లిష్టమైందన్నారు. అభ్యర్థులు కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని.. సాధ్యమైనంత వరకూ పరీక్షలు ఈ విధానంలోనే ఉంటాయని స్పష్టం చేశారు. కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల తరహాలోనే తెలంగాణలో కూడా పరీక్షల నిర్వహణకు పతిభా భారతి అనే సరికొత్త పద్ధతిని తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 28 రకాల పోస్ట్‌లకు ఒక్కో ఖాళీ ఉందని, ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయని బుర్రా వెంకటేశం తెలిపారు. 50 కంటే ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉన్నది 11 శాఖల్లోనేనని తెలిపారు. భవిష్యత్‌లో రెండు, మూడు నెలలకోసారి మీడియా సమావేశాలు నిర్వహిస్తామని కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. మీడియాతో మాట్లాడకపోవడం కంటే మాట్లాడటమే మంచిదని భావిస్తున్నామన్నారు. ఉద్యోగాలు వచ్చిన వారి కంటే రాని వారి సంఖ్యే ఎక్కువగా ఉంటుందని.. అందరికీ ఉద్యోగం ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదన్నారు. అందుకే తమపై ఎక్కువ మందికి కోపం ఉంటుందన్నారు. అందులో తప్పు కూడా లేదన్నారు. కమిషన్‌పై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని అలాంటి గురించి పట్టించుకుంటే తాము అనుకున్న పనులను సక్రమంగా నిర్వహించ లేమన్నారు.

## నీట్ రీ-ఎగ్జామ్ ఓఎంఆర్ పద్ధతిలోనే

### ఎన్‌టిఏకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జూన్ 1:** రాబోయే నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్‌ను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) విధానంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో జూన్ 21న జరగాల్సి న రీ-ఎగ్జామ్‌ను ప్రస్తుతం ఉన్న పెన్ అండ్ పేపర్ (ఓఎంఆర్) విధానంలో నిర్వహించడానికి మార్గం సుగమమైంది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం తక్షణ ఉపశమనం కల్పించడానికి నిరాకరించి, విచారణ జులైకి వాయిదా వేసింది.

విచారణ సందర్భంగా, పిటిషనర్ తరపు న్యాయవాది, రాజ్యసభ ఎంపి సుధాకర్ సింగ్, తాము కేవలం సిబిటి విధానంలో పునఃపరీక్ష నిర్వహించాలనే డిమాండ్‌ను మాత్రమే ముందుకు తెస్తున్నామని కోర్టుకు తెలియజేశారు. ఇలాంటి పిటిషన్లు గతంలో కూడా కొట్టివేయబడ్డాయని ధర్మాసనం గుర్తుచేసింది. పునఃపరీక్షకు సన్నాహాలు ఇప్పటికే జరుగుతున్న సమయంలో పరీక్షా విధానాన్ని మార్చడంలో ఉన్న ఆచరణాత్మక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొంది. అసలు పరీక్ష రద్దు కావడం, కొత్తగా పరీక్ష నిర్వహించాల్సి న అవసరం ఏర్పడటంతో అధికారులు గణనీయమైన ఒత్తిడిలో పనిచేస్తున్నారని కూడా కోర్టు ఎత్తి చూపింది. దీంతో, నీట్ యుజి 2026 పునఃపరీక్ష జూన్ 21న సాంప్రదాయ ఆఫ్‌లైన్ పద్ధతిలో కొనసాగుతుంది. పరీక్షా సంస్కరణలకు సంబంధించిన విస్తృత అంశాలు, సిబిటికి మారే అవకాశం వంటి విషయాలను జులైలో విచారణ జరిగినప్పుడు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

## ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ రాజీనామా!

**టెహ్రాన్, జూన్ 1:** ఇరాన్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తన పదవికి అధికారికంగా రాజీనామా చేస్తూ.. దేశ సుప్రీం లీడర్ అయాతొల్లా మొజ్తబా ఖమేనీకి లేఖ సమర్పించడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది. దేశంలో సైన్యం నిశ్శబ్ద తిరుగుబాటుకు పాల్పడిందని, ఎన్నికైన పౌర ప్రభుత్వాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి అధికారాలన్నింటినీ లాగేసుకుందని పేర్కొంటూ పెజెష్కియాన్ తన రాజీనామా లేఖలో బాంబు పేల్చారు. వివిధ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం ఇరాన్ ప్రభుత్వంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న అంతర్గత పోరు ఈ నిర్ణయంతో క్లైమాక్స్‌కు చేరింది. దేశంలోని కీలకమైన, వ్యూహాత్మక నిర్ణయాలన్నింటి నుంచి తనను, తన మంత్రివర్గాన్ని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్లు పూర్తిగా పక్కనబెట్టారని అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏర్పడిన ఈ అధికార శూన్యతను ఆసరాగా చేసుకుని, ఐఆర్‌జీసీలోని కఠినతరమైన హార్డ్‌లైనర్ గ్రూపులు దేశ పరిపాలనను తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని ఆయన ఆరోపించారు.

**సైన్యం చర్యలపై తీవ్ర అసంతృప్తి**

ఇటీవల పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో జరిగిన ఉద్రిక్తతలు, యూఏఈ పై జరిగిన డ్రోన్, క్షిపణి దాడుల వెనుక ఐఆర్‌జీసీ మిలిటరీ నాయకత్వమే ఉందని పెజెష్కియాన్ లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి కనీస సమాచారం కూడా లేకుండా సైన్యం ఇష్టారాజ్యంగా జరిపిన ఈ దాడులను ఆయన కేవలం ఒక పిచ్చిచర్యగా అభివర్ణించారు. బాధ్యతారాహిత్యమైన ఇటువంటి చర్యల వల్ల దేశం కోలుకోలేని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి అసాధారణ పరిస్థితుల్లో, రాజ్యాంగం నాకు కల్పించిన కనీస బాధ్యతలను కూడా నేను నెరవేర్చలేకపోతున్నాను. అందుకే ఈ పీఠంపై కొనసాగడం అర్థరహితమని రాజీనామా లేఖలో పెజెష్కియాన్ పేర్కొన్నారు.

తన అధికారాలను సైన్యం క్రమంగా లాగేసుకోవడాన్ని నిరసిస్తూ పదవి నుంచి తప్పుకునే ముందే అధ్యక్షుడు పెజెష్కియాన్ ఈ విధంగా తిరుగుబాటు జెండా ఎగరేశారు. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఒక కొలిక్కి వస్తున్న తరుణంలో, ఇరాన్ దేశాధినేతే తిరుగుబాటు ఊహాగానాలను నిజం చేస్తూ తప్పుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఈ రాజీనామాను ఆమోదిస్తారా లేదా అనేది ఉత్కంఠగా మారింది.

## నేటి నుంచి లోకేష్ రష్యాలో పర్యటన

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 2 మంగళవారం నుంచి రష్యాలో పర్యటించనున్నారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈపర్యటన సాగనుంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నే షనల్ ఎకనామిక్ ఫోరమ్ (ఎస్‌పిఐఇఎఫ్) సదస్సులో పాల్గొనాలని మంత్రి లోకేష్‌కు ఆహ్వానం అందింది. ప్రపంచ వ్యాప్తంగా పలుదేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ముఖ్యంగా ఐటి, విద్య, ఇతరకీలక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన చర్చలు జరపనున్నారు. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెద్దయెత్తున పెట్టుబడు లొస్తాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# ప్రతిభావంతుల వేట.. పార్టీ అధికార ప్రతినిధుల నియామకం



## పదవుల కంటే దేశం ముఖ్యమనేది రాహుల్ విధానం

### యువత రాష్ట్ర, దేశ రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** ప్రతిభావంతుల వేట పేరుతో కాంగ్రెస్ అధికార ప్రతినిధులను నియామకం చేసే నూతన ఒరవడికి కాంగ్రెస్ అగ్రతనేత రాహుల్‌గాంధీ శ్రీకారం చుట్టారని పిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు. సోమవారం గాంధీభవన్ విలేఖ రుల సమావేశంలో మాట్లాడుతూ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అధికార ప్రతినిధుల నియామానికి సాంప్రదాయ పద్ధతులు వదిలివేస్తూ ఆధునిక అవసరాలకు అనుగుణంగా పార్టీలో మానవ వనరు లను సాంకేతిక ప్రపంచంలో అందరికి జవాబుదారఈగా ఉండే కొత్త పద్ధతిని తీసుకువచ్చారనీ తెలిపారు. రాహుల్‌గాంధీకి పదవుల కంటే దేశం ముఖ్యమని అందుకే ఆయనకు రెండు సార్లు ప్రధానమంత్రి పదవి చేపట్టే అవకాశం వచ్చినా తీసుకోలేదని మహేష్ గుర్తుచేసుకొన్నారు. టాలెంట్ హంట్ పేరుతో తెలంగాణలో కూడా అధికార ప్రతి నియామకంచేస్తామని ఆయన వివరించారు. జాతీయ రాజకీయాలు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై అవగాహన ఉన్నవారని గుర్తించి అవకాశం ఇవ్వడమే కాకుండా ప్రజల అవసరాలను అంచనా వేసి వారికి సరైన అవకాశాలు కల్పించే నాయకత్వంను పెపొందిం చుకొనే దిశలో పార్టీని నూతన ఆలోచనలతో పార్టీ సంస్థా గత నిర్మాణం చేస్తామని తెలిపారు. శాస్త్రీయ దృక్పథం కలిగిన నాయకత్వంను పెంచడానికి లౌకిక వాదం పై పట్టున్న వ్యక్తులను గుర్తించి ఎంపిక చేయాలనే రాహుల్ గాంధీ సంకల్పంను తెలంగాణలో ఆచరణలోపెట్టి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తామని తెలిపారు. తెలంగాణ యువతకు టాలెంట్ హంట్ సువర్ణావకాశంగా ఉంటోందన్నారు. పార్టీలకు అతీతంగా టాలెంట్ హంట్ పేరుతో నూతన అభ్యర్థులకు రాజకీ యాల్లోకి వచ్చి సమాజసేవ చేయాలనే దృక్పథం కలిగిన వ్యక్తలను ఎం పిక చేసే అవకాశం ఇదని అన్నారు. యువతరానికి అపా రమైన అవకాశాలు కల్పించాలని రాహుల్‌గాంధీ సంకల్పిం చారని అన్నారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలక పాత్ర పోషించాలని టాలెంట్ హంట్ పేరుతో ఎంపిక చేపడుతో న్నారని అన్నారు. సోషల్ మీడియా ప్రభావం అన్నింటిపై ఉంటుందనీ సంకుచిత మనస్తత్వం వీడి వి శాల దృక్పథంతో పనిచేయాలని రాహుల్ సూచిం చారని ఆయన తెలిపారు. పార్టీలో మంచి పరిజ్ఞానం ఉండి బాగా మాట్లాడే వారిని ప్రోత్స హించాలని రాహుల్ భావి స్తున్నారని ఆయనకు స్వార్థం ఉంటే 2004, 2009లో ప్రధాని అయ్యే అవకాశం జారవిడుచుకొనేవాడు కాద న్నారు. యువత దేశ,రాష్ట్ర రాజకీయాలపై అవగాహన పెంచుకొంటేనే దేశం అభివృద్ధి చెందుతోందన్నారు.

# జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన ఎస్సీ గురుకుల విద్యార్థులు

### 163 మందికి ఐఐటిలో అవకాశం

### జెఇఇ మెయిన్స్‌లో 358 మంది అర్హత

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాసంస్థలు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాయి. జేఈఈ మెయిన్స్-2026, జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షల్లో గురుకుల విద్యార్థులు సాధించిన ఫలితాలు నాణ్యమైన ప్రభుత్వ విద్యకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. జేఈఈ మెయిన్స్-2026 పరీక్షకు మొత్తం 355 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 61 మంది విద్యార్థులు ఐఐటి లో సీటులో పొందారు. 102 మంది ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి మొత్తం 163 మంది ఐఐటీల్లో ప్రవేశాలకు అర్హత సాధించారు. 500 లోపు ఒకరు, 1000 లోపు ముగ్గురు, 2000 లోపు 14 మంది, 3000 లోపు 25 మంది, 5000 లోపు 39 మంది విద్యార్థులు కమ్యూనిటీ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో తమ సత్తాను నిరూపించారు. చిలుకూరు బాయ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన పీ. హేమంత్ ఎస్టీ కేటగిరీలో ఆల్ ఇండియా కమ్యూనిటీ ర్యాంక్-200 సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని విద్య ద్వారా సాకారం చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని గురుకుల విద్యార్థులు మరోసారి నిరూపించారు. గ్రామీణ ప్రాంతాలు, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించడం తెలంగాణకు గర్వకారణమన్నారు.

గురుకుల విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎయిమ్స్ వంటి జాతీయ స్థాయి సంస్థల్లో రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. గత రెండేళ్లుగా గురుకుల విద్యాసంస్థల్లో అకాడమిక్ ప్రమాణాల పెంపు, ఆధునిక బోధనా విధానాలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల మానసిక దృఢత్వం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలు ఫలితాల రూపంలో ప్రతిఫలిస్తున్నాయన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 ఫలితాలు తెలంగాణ గురుకుల విద్యా వ్యవస్థ దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోందని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి విజయాలను నమోదు చేసే దిశగా సొసైటీ ముందుకు సాగుతోందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# పవన్‌కల్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 1, ప్రభాతవార్త:** ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముందుగా తెలం గాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాకే నవ నిర్మాణ సభలు నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ, తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తిననని చెప్పిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేళ రాష్ట్రంలో సభలు నిర్వహించడం ఆక్షేపణీయమన్నారు. తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎపితో తెలంగాణకు సోదర సంబంధాలు ఉన్నాయని, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య ప్రేమా భిమానాలు కొనసాగాలని తాము కోరుకుంటున్నామని, అయితే తెలంగాణపై విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను సహించబోమన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా సభలు నిర్వహించవచ్చని, అయితే విద్వేష రాజకీయాలకు తెలంగాణలో స్థానం లేదని స్పష్టం చేశారు.

# ఫెడరేషన్ల చైర్మన్లకు ఛాంబర్లు ఖరారు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన కార్పొ రేషన్లు, ఫెడరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఎట్టకేలకు ఛాంబర్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్ సమీపంలో ఉన్న ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) బిల్డింగ్‌లో వీరికి ఛాంబర్లను కేటాయించారు. వెనుకబడిన తరగతుల (బిసి) వెల్ఫేర్ అనుబంధ కార్పొరేషన్లు, ఫెడరేషన్లలో మొత్తం 9 మంది చైర్మన్లు, మరో 9 మంది వైస్ చైర్మన్లను ప్రభుత్వం నియమించింది. వీరంతా మాసాబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇందులో ఇద్దరు చైర్మన్లకు మాత్రమే సంక్షేమ భవన్లో ఛాంబర్లు కేటాయించారు. మిగతా వారికి కేటాయించడానికి స్థలం లేకపోవడంతో 20 రోజులుగా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అన్వేషిస్తు న్నారు. మొదట బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో కేటాయించాలని భావించి నప్పటికీ, అక్కడ ఖాళీ లేదని అధికారులు తెలిపారు. ఆ తర్వాత నాంపల్లిలోని హౌసింగ్ బోర్డు బిల్డింగులను సైతం పరిశీలించారు. కానీ, అవి చాలా పాతవి కావడంతో అధికారులు వెనకడుగు వేశారు. చివరకు ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కార్యాలయాన్ని ఫైనల్ చేశారు.

# విదేశీ స్కాలర్‌షిప్‌కు మైనార్టీల నుండి దరఖాస్తుల స్వీకరణ

### రూ.20 లక్షల వరకూ ఆర్థిక సాయం

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న అర్హు లైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సర కాలానికి గాను మైనారిటీల కోసం ముఖ్యమంత్రి విదేశీ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తులను ఆహ్వానిం చింది. మైనారిటీ సంక్షేమ శాఖ సోమవారం ఒక ప్రకటనలో అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణకొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి దేశాల్లోని విశ్వ విద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులలో ప్రవేశం పొందిన మైనారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపింది. ఈ పథకం కింద, ఎంపికైన అభ్యర్థులకు రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయంతో పాటు, ఒకవైపు ప్రయాణానికి రూ.60,000 విమాన ఛార్జీ లేదా అసలు టిక్కెట్టు ధర, ఈ రెండింటిలో ఏది తక్కువైతే అది అందజేయబడుతుందని పేర్కొంది. సోమవారం నుండి జూన్ 30వ తేదీ, సాయంత్రం 5:00 గంటల వరకు అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలియచేసింది. అలాగే ఈ ఏడాది జనవరి 1, నుండి జూన్ 30వ తేదీ మధ్య ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందని అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ అకడమిక్ ట్రాన్స్క్రిప్ట్‌లను సమర్పించాల్సి ఉంటుంది. అలాగే సంబంధిత జిల్లా కార్యాలయాల్లో పత్రాల సమర్పణ సమయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుందని వెల్లడించింది.

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం చేయాలి

### సాంకేతిక, వాణిజ్య నష్టాలు తగ్గించండి

### పంపిణీ సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

### కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** స్మార్ట్ మీటరింగ్ ఏర్పాటును వేగవంతంగా అమలు చేయాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ రాష్ట్రాలకు సూచించారు. రాష్ట్రానికి సంబంధించిన విద్యుత్ రంగానికి సంబంధించిన విషయాలను ఆయన సమీక్షి ంచారు. నూతన పంపిణీ రంగ పథకానికి సంబంధించిన విషయాలు, డిస్కామ్‌ల కార్యాచరణ, ఆర్థిక పారామితులపై చర్చ జరిగింది. మొత్తం సాంకేతిక మరియు వాణిజ్య నష్టాలను తగ్గించడం, డిస్కామ్‌ల ఆర్థిక పనితీరును మెరుగుపరచడం యొక్క ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.

ప్రభుత్వ వినియోగదారులు, సంస్థల్లో ఏర్పాటు చేసిన మీటర్లను ప్రీపెయిడ్‌గా మార్చడంపై ప్రత్యేక దృష్టి సారించి, రాబడి వసూళ్లను మెరుగుపరచాల్సిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. ఆగస్టు నెల నాటికి వినియో గదారులను ప్రీపెయిడ్ మీటరింగ్‌కు మార్చడానికి, జూలై 2027 నాటికి పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ మీటర్ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి రాష్ట్రంలో వనరుల లభ్యత, అంతర్రాష్ట్ర ప్రసార ప్రణాళిక స్థితిని ఎప్పకప్పుడు పర్యవేక్షించాలన్నారు. రాష్ట్రాల్లో విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు అనుగుణంగా ప్రసార సామర్థ్య పెంపు ఉండేలా చూసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. వనరుల లభ్యత ప్రణాళిక ప్రకారం అంతర్రాష్ట్ర ప్రసార మోలిక సదుపాయాలను వేగంగా పెంచడానికి, అమలు చేయడానికి కార్యాచరణ ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# కాంగ్రెస్ అంటేనే కష్టాలు, కన్నీళ్లు

### బిజెపి అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్

### ఉద్యోగుల జీతాలను దారిదోపిడీ చేస్తుంది: ప్రభాగౌడ్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అంటేనే కష్టాలు కాంగ్రెస్ అంటేనే కన్నీళ్లు అన్నట్టుగా నేడు తెలంగాణ రాష్ట్రంలో పాలన సాగుతుందని బిజెపి అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ మండిపడ్డారు. ఒకపక్క రైతులు కళ్ళాలలో కన్నీరు పెడుతుంటే, మరోపక్క కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల ముందస్తు అనుమతి లేకుండా వేతనాల నుండి 1.5 శాతం ప్రీమియం కోత విధించడాన్ని ఆయన ఖండించారు. మధ్యతరగతి కుటుంబాలు నెలవారీ బడ్జెట్ ప్లాన్ చేసుకునే జీతాన్ని ఇలా చాటుమాటుగా కట్ చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కును (ఆర్టికల్ 300ఏ) కాలరాయడమేనని, ఇది సుప్రీంకోర్టు తీర్పులకు పూర్తిగా వ్యతిరేకమని వికాస్ మండిపడ్డారు. బిజెపి ఉద్యోగుల హెల్త్ కార్డ్‌లకు వ్యతిరేకం కాదని, కానీ దానికి ఒక సరైన ప్రణాళిక ఉండాలని ఆయన పేర్కొన్నారు. కనీసం జిఓ ఆర్డర్ లేకుండా, హెల్త్ కేర్ ట్రస్ట్ గానీ, ఒక సిఈఓను గానీ నియమించ కుండా ఈ ప్రక్రియను నడపడం ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులతో చర్చలు జరిపి, ఎంపానెల్డ్ ఆసుపత్రుల జాబితాను, రోగాల వారీగా ప్యాకేజీల వివరాలను వెంటనే పబ్లిష్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఇద్దరి దగ్గరా కట్ చేస్తూ, ఏడాదికి రూ. 40,000 వరకు లాక్కోవడం వల్ల ఇది ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంటే కాస్ట్‌లీగా మారిందన్నారు. 25 ఏళ్ల పైబడిన పిల్లలకు ఇది వర్తిస్తుందా? ప్రీమియం లిమిట్ ఎం? అనే విషయాలపై స్పష్టత లేదని, కేవలం 36 మంది మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేసుకున్నా, మిగతా అందరి జీతాల్లో కోత విధించడం దారుణమని చెన్నమనేని వికాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.మరోవైపు బిజెపి మీడియా ప్యానలిస్ట్ ప్రభాగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందన్న నెపంతో, దాన్ని నింపుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల జీతాలను దారిదోపిడీ చేస్తోందని మండిపడ్డారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ప్రీమియం తీసుకోకుండా ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5 లక్షల ఉచిత వైద్యం అందిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజల జేబులు గుల్ల చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల నేడు ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని గుర్తుచేశారు. ఒకపక్క రైతులను, మరోపక్క ఉద్యోగులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే మేల్కొని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకపోతే రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని ప్రభాగౌడ్ హెచ్చరించారు.

# ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థకు అవార్డు

### సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** డిజిటల్ విద్యుత్ సేవల విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల అమలు, వినియోగదారులకు నాణ్య మైన సేవల అందజేయడంలో విశేష కృషికి గాను ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) దేశ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన 11వ గవర్నెన్స్ నౌ పిఎస్‌యు ఐటి అవార్డు దక్కింది. ఈ విషయాన్ని ఎన్పీడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రత్యేక అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థకు ప్రతి ష్టాత్మక 'గవర్నెన్స్ నౌ 11వ ఇండియా పిఎస్‌యు ఐటీ అవార్డు'ను ఎన్పీడీసీఎల్ నుంచి కంపెనీ సెక్రటరీ కే.వెంకటేశం, జియం శ్రీనివాస్ అందుకున్నారు. ఈ అవార్డును సోమవారం ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డును అందచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, డిజిటల్ పరివర్తన వైపు అడుగులు వేస్తున్నందుకు గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు చెప్పారు.

ముఖ్యంగా సూపర్వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, అవుటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి ఆధునిక వ్యవస్థల అమలు ద్వారా విద్యుత్ పంపిణీ వ్యవస్థను స్మార్ట్ గ్రిడ్ దిశగా తీసు కెళ్తున్నందుకు సంస్థకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని పేర్కొన్నారు తమ సంస్థ పరిధిలో అమలు చేస్తున్న డిజిటల్ వ్యవస్థల ద్వారా విద్యుత్ అంతరాయాలను క్షణాల్లో గుర్తించడం, లోపాలను వేగంగా సరిచేయడం, వినియోగ దారులకు ముందస్తు సమాచారం అందించడం, విద్యుత్ నష్టాలను తగ్గించడం వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందన్నారు. జిఐఎస్ మ్యాపింగ్ ద్వారా ప్రతి ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్, విద్యుత్ లైన్, వినియోగదారుని డిజిటల్ మ్యాప్‌లో నమోదు చేయడం వల్ల నెట్‌వర్క్ ప్రణాళిక, లోపాల గుర్తింపు, అత్యవసర మర మ్మతు పనులు మరింత వేగవంతం అవుతున్నా యని చెప్పారు. ఈ డిజిటల్ మార్పుల ఫలితంగా ఫాల్ట్ రీస్టోరేషన్ సమయం గంటల నుండి నిమిషాలకు తగ్గడం, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కా రంలో వేగం పెరగడం, నష్టాలు తగ్గడం, విద్యుత్ సరఫరా విశ్వసనీయత మెరుగుపడడం వంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు.

# సామాజిక న్యాయం ధ్యేయంగా కాంగ్రెస్ పాలన



### కాంగ్రెస్ ఎస్‌సి విభాగం విస్తృతస్థాయి సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం ధ్యేయంగా కాంగ్రెస్ పాలన సాగిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాల అభివృద్ధికి కట్టు బడి ఉందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఎంఎల్‌సి మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. బేగంపేట్‌లో సోమవారం జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం విస్తృతస్థాయి సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి డిపార్ట్‌మెంట్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్య నారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడు తూ సర్‌తో ఓట్ల చోరి జరగకుండా కాంగ్రెస్ ఎస్‌సి విభాగం కార్యర్తలు అప్రమత్తంగా ఉండాలని మీ పరిధిలో ఎవరి ఓటు కూడా గల్లంతు కాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ పార్టీ బలోపేతం కావాలంటే అనుబంధసంస్థలు కూడా సంస్థా గతంగా బలంగా ఉండాలని కార్యకర్తల సంఖ్యను పెంచుకోవాలని కోరారు. సామాజిక న్యాయం, ఎస్సీ వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మొదలుకొని ఇందిర, రాజీవ్‌గాంధీ అనేక సంక్షేమ పథకాలు పెట్టడంతో పాటు భూములు కూడా పంపిణీచేశారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అత్యంత జాగ్రత్తగా గమనించాలని అణగారిన వర్గాల ఓట్లు గల్లంతు చేయకుండా ప్రజలను చైతన్యం చేసి జాబితాలో వారి పేర్లు ఉన్నాయో లేవో తనిఖీ చేసుకొనేలా ప్రోత్స హించాలనీ కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చర్చించారు.

# కూలర్‌లో నీరు నింపుతుండగా విద్యుదాఘాతం.. తండ్రీకుమారులు మృతి

### నిర్మల్ జిల్లా పెంబిలో విషాదం

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా పెంబిలో విషాదం చోటు చేసుకుంది. వేసవికాలం కావడంతో ఇంట్లో చల్లనిగాలి కోసం తెచ్చుకున్న కూలర్‌లో నీరు నింపుతుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి తండ్రి, కుమా రుడు చనిపోయాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన జ రిగింది. పెంబి మండలం కోరికంటి తండాలో వుంటున్న రాథోడ్ అర్జున్ (48) అతని కుమారుడు రాథోడ్ శ్రీనివాస్ (25)లు ఆదివారం రాత్రి 8.45 గంటల సమయంలో ఇంట్లో కూల ర్‌లో నల్లాపైపు ద్వారా నీటిని నింపుతున్నారు. ఆ సమయంలో కూలర్ పని చేస్తుండడంతో ఒక్కసారిగా కరెంట్ షాక్ తగిలి రాథోడ్ అర్జున్, రాథోడ్ శ్రీనివాస్‌లు కుప్పకూలారు. దీంతో కుటుంబ సభ్యులు వీరిద్దరిని సమీపంలోని ఆసుపత్రికి త రలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. కాగా కరెంట్ షాక్ తగిలి చనిపోయిన తండ్రి, కొడుకుల భౌతిక కాయాలకు సోమవారం ఉదయం పోస్టు మార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్ప గించారు. వారి మృతదేహాలకు సాయంత్రం వేళ అంత్యక్రియలు జరిపారు. ఈ ఘటన కోరికంటి తండాలో విషాదాన్ని నింపింది. పెంబి ఎస్ఐ హనుమాన్లు ఈ కేసును విచారిస్తున్నారు.

# ధాన్యం సేకరణలో దళారులదే రాజ్యమా?

### కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అవినీతి, అక్రమాల బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పయనిస్తూ తెలంగాణ ప్రజానీకాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతోందని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు. ఇరిగేషన్, విద్యుత్, పురపాలక, పౌర సరఫరాల శాఖల్లో అప్పట్లో జరిగిన తప్పిదాలనే నేటి పాలకులు కూడా యథాతథంగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం సేకరణ నిరంతర ప్రక్రియ అయినప్పటికీ, ప్రభుత్వాల నిరక్ష ్యం వల్ల దళారులు దోచుకుంటుంటే, అన్నదాతలు మాత్రం నష్టపోతున్నారని, అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని ఆయన మండిపడ్డారు. విద్యుత్ రంగంలో డిస్కంలు రూ. 69 వేల కోట్ల పైచిలుకు నష్టాల్లో కూరుకు పోయినా, ప్రభుత్వాలు మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని ప్రభాకర్ విమర్శించారు. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ వినియోగంపై సరైన లెక్కలు లేకపోవడం దారుణమని, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల పేరుతో గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రిటైర్డ్ అధికారులను సలహాదారులుగా పెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకుంటున్నాయని ఆయన ఆక్షేపించారు. కేవలం పరస్పర విమర్శలు, విచారణల పేరుతో కాలయాపన తప్ప, వ్యవస్థను చక్కదిద్దే చిత్తశుద్ధి ఏ ప్రభుత్వానికి లేదని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం అని పదే పదే చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ రాజ్యానికి పునాదిగా చెప్పుకునే ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను నీరుగారుస్తోందని ప్రభాకర్ మండిపడ్డారు.

# జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో ప్రిపరేటరీ ఎస్టీ విభాగంలో 831వ ర్యాంకు సాధించిన కెజిబివి బాలిక

### అభినందించిన పాఠశాల విద్యాడైరెక్టర్ నవీన్‌నికోలస్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు అద్భుత మైన ప్రతిభను చూపుతున్నారు. ఫరూఖ్‌నగర్ కేజీబీవీకి చెందిన బి. అఖిల, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రిపరేటరీ ఎస్టీ విభాగంలో 831వ ర్యాంకుతో అద్భుతమైన విజయాన్ని సాధించారు. ఈ విజయంతో ఈ విద్యార్థిని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో ఒక సంవత్సరం ప్రిపరేటరీ కోర్సులో ప్రవేశం పొందేందుకు బలమైన అవకాశం ఉంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన మరో ఏడు మంది విద్యార్థినులు ఎన్ఐటిలతోపాటు ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో ప్రవేశాలు పొందే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లా, ఆత్మకూరు కేజీబీవీకి చెందిన టి. నవ్య వ్యవసాయం ఫార్మసీ విభాగంలో 787వ ర్యాంకు సాధించడంతో సహా, ఈఏపీసీఈటీలో కేజీబీవీ విద్యార్థులు కనబరిచిన అద్భుతమైన ప్రతిభ, కేజీబీవీలలో చదువుతున్న బాలికల పెరుగుతున్న విద్యా ఆకాంక్షలను, సామర్థ్యాలను స్పష్టం చేస్తోందని పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ అన్నారు. ఇంజనీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ విభాగాలలో వందలాది మంది విద్యార్థులు అర్హత సాధించడం ఈ సంస్థల ద్వారా నిర్మించబడుతున్న బలమైన పునాదిని మరింతగా ప్రతిబింబిస్తోందన్నారు. పతి అమ్మాయి తన పూర్తి సామర్థ్యాన్ని గ్రహించగలదని నిరూపిస్తున్నాయి.డాక్టర్ ఇ. నవీన్ నికోలస్, ఐఏఎస్‌రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.




# ఇహెచ్‌సిటి విధివిధానాలను ప్రకటించాలి

### హెల్త్‌కార్డు పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులపై అదనపు భారం వేయకూడదు

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రత, వేతనాలు, పెండింగ్ సమస్యలు, ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) అమలుపై ప్రభుత్వం స్పష్టమైన విధానాలు ప్రకటిం చాలని కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డులు ఇస్తున్నా మనే పేరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులపై అదనపు భారం వేయొద్దన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యా యులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సోమ వారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అధ్యక్షులు వడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పెంటయ్య, ఆర్గనైజేషన్ కార్యదర్శి హన్మంత రావు పాల్గొన్నారు. పూర్తిస్థాయి మార్గదర్శకాలు విడుదల చేశాకే అమలు ప్రక్రియ చేపట్టాలన్నారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, ఎస్ఎస్ఏ, యూఆర్ఎస్, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల సంస్థల్లో పనిచేస్తున్న శాశ్వత, తాత్కాలిక ఉపాధ్యాయులు, సిబ్బందికి కూడా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదురహిత వైద్యం, ఓపీ సేవలు అందుబాటులో ఉండేలా పారదర్శక ఆన్‌లైన్ విధానం అమలు చేయాలన్నారు. కలెక్టర్లను డీఈ వోలుగా నియమించే విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహ రించుకోవాలని, జనగామ జిల్లాలో ప్రస్తుతం డీఈవోగా వ్యవహరిస్తున్న కలెక్టర్‌ను మార్చాలని కోరారు.



# పరస్పర దాడులతో వేడెక్కిన పశ్చిమాసియా

## అమెరికా, ఇరాన్ దాడులతో మళ్లీ ఉద్రిక్తత

**టెహ్రాన్, వాషింగ్టన్,జూన్ 1:** మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ పొడిగింపు కోసం దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అమెరికా, ఇరాన్ బలగాలు గత వారాంతంలో డ్రోన్లు, క్షిపణులతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్ దూకుడుకు ప్రతిగా ఆత్మరక్షణ దాడులు జరిపామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించగా, ఇది తమపై జరిగిన దాడికి ప్రతీకార చర్యేనని ఇరాన్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నిఘా పెట్టిన తమ ఎమ్‌క్యూ1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపించింది. దీనికి ప్రతిగా, అమెరికా ఫైటర్ జెట్లు దక్షిణ ఇరాన్‌లోని గోరుక్ ప్రాంతం, క్విష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ వ్యవస్థలు, డ్రోన్ కంట్రోల్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించినట్లు సెంట్‌కామ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో ఇరాన్‌కు చెందిన రెండు సూసైడ్ డ్రోన్లను కూడా ధ్వంసం చేశామని, తమ సైనికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది. అమెరికా దాడులకు ప్రతీకారంగా, సరిక్ ద్వీపంపై దాడిలో పాల్గొన్న ఒక అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు, తమ గగనతలంలోకి ప్రవేశించిన కొన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా నాశనం చేసినట్లు కువైట్ సైన్యం ప్రకటించింది. ఈ దాడుల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 2 శాతం పెరిగి 93.05 డాలర్లకు చేరింది. గత దాడుల్లో ధ్వంసమైన భూగర్భ క్షిపణి టన్నెళ్లను ఇరాన్ వేగంగా పునరుద్ధరిస్తోందని అమెరికా మీడియా కథనాలుప్రచురించాయి. శాటిలైట్ చిత్రాల ఆధారంగా, దెబ్బతిన్న 69 టన్నెల్ ప్రవేశ మార్గాల్లో ఇప్పటికే 50 మార్గాలను ఇరాన్ తిరిగి వినియోగంలోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ పరిణామాలు గల్ఫ్ రీజియన్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి.

# విమానంలో 'బాంబ్' బ్లూటూత్ హైడ్రామా..

## - అమెరికా విమానం యూటర్న్ - న్యూజెర్సీలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

**వాషింగ్టన్, జూన్ 1:** అమెరికాలో ఒక ప్రయాణికుడు తన బ్లూటూత్ పరికరానికి సరదాగా పెట్టిన పేరు పెనుకలకలం సృషించింది. 'బాంబ్' అనే పేరుతో సిగ్నల్ కనిపించడంతో, స్పెయిన్‌కు బయలుదేరిన యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానం అట్లాంటిక్ మహాసముద్రం మీది నుంచి వెనక్కి తిరిగివచ్చి, అమెరికాలోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం 150 మంది ప్రయాణికులతో న్యూజెర్సీలోని నెవార్క్ నుంచి స్పెయిన్‌కు బయలుదేరింది. విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటి తర్వాత, సిబ్బంది 'బాంబ్' అనే పేరుతో ఉన్న ఓ బ్లూటూత్ డివైజ్‌ను గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, ప్రయాణికులందరూ తమ బ్లూటూత్ కనెక్షన్లను ఆపేయాలని పదేపదే అనౌన్స్ చేశారు. అయినా కొన్ని డివైజ్‌లు యాక్టివ్‌గా కనిపించాయి. ఇందులో 'బాంబ్' పేరుతో ఉన్న డివైజ్ కూడా ఉంది. దీంతో పైలట్లు జనరల్ ఎమర్జెన్సీ ప్రకటించి, విమానాన్ని వెనక్కి మళ్లించారు. తిరిగి నెవార్క్‌లో సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత, పోర్ట్ అథారిటీ పోలీసులు విమానాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఒక టీనేజీ ప్రయాణికుడు తన బ్లూటూత్ పరికరానికి ఆ పేరు పెట్టినట్లు విచారణలో గుర్తించారు. విమానాన్ని, ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి ప్రమాదకర వస్తువులు లేవని నిర్ధారించుకున్నారు. ఈ ఘటన కారణంగా విమానం తొమ్మిది గంటలకుపైగా ఆలస్యంగా స్పెయిన్‌కు చేరుకుంది. భద్రతాపరమైన ఆందోళన కారణంగానే విమానాన్ని వెనక్కి మళ్లించామని యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

# మా ఆక్రమణలోనూ భారత్ భూభాగాలు

## నేపాల్ ప్రధాని బాలేన్‌షా సంచలన వ్యాఖ్యలు

## రెండు దేశాలు చర్చించి పరిష్కరించుకోవాలని సలహా

**ఖాట్మండు, జూన్ 1:** భారత్‌నేపాల్ మధ్య నలుగుతున్న సరిహద్దు వివాదం మళ్లీ రాజుకుంది. భారత్ తమ భూభాగాలను ఆక్రమించిందని ఆరోపిస్తున్న నేపాల్ తాము కూడా భారత భూభాగాలను కొన్నిచోట్ల ఆక్రమించామని ఆ దేశ ప్రధాని బాలెన్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలతో నేపాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగగా, గంటల వ్యవధిలోనే ప్రభుత్వం వివరణ ఇచ్చి నష్టనివారణ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పార్లమెంటులో ప్రసంగించిన 35 ఏళ్ల బాలెన్ షా, సరిహద్దు వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని అయ్యాక నాకు తెలిసిన ఓ వాస్తవం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది. భారత్ మాత్రమే కాదు, నేపాల్ కూడా చాలా చోట్ల భారత భూభాగాన్ని ఆక్రమించింది. ఇప్పుడు రెండు దేశాలు స్నేహితుల్లా కూర్చొని, వాస్తవాలను అధ్యయనం చేసి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. ఇందుకోసం చరిత్రకారులు, సర్వేయర్లు, నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని చైనా, యూకే దృష్టికి కూడా తీసుకెళ్లామని ఆయన తెలిపారు. ప్రధాని వ్యాఖ్యలతో నేపాల్ పార్లమెంటులో వెంటనే గందరగోళం చెలరేగింది. సొంత దేశమే భారత భూభాగాన్ని ఆక్రమించిందని ప్రధాని ఎలా అంటారని ప్రతిపక్ష నేపాలి కాంగ్రెస్, నేపాలి కమ్యూనిస్ట్ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రధాని తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపాలని లేదా వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మాజీ విదేశాంగ మంత్రి ప్రదీప్ గ్యావలీ సైతం ప్రధాని క్షమాపణ చెప్పాలని కోరారు. మరోవైపు నేపాల్ మాజీ దౌత్యాధికారులు, సరిహద్దు నిపుణులు కూడా ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టారు. నేపాల్ ఎన్నడూ భారత భూభాగాన్ని ఆక్రమించలేదని సరిహద్దు నిపుణుడు బుద్ధి నారాయణ్ శ్రేష్ఠ స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో సరిహద్దు స్తంభాలు లేకపోవడంతో ఇరువైపుల రైతులు పరస్పరం భూములను వాడుకుంటున్నారని, దీనిని ఆక్రమణ అనలేమని అన్నారు. ప్రధానికి ఈ విషయంపై పూర్తి సమాచారం లేదని, భారత్ కూడా ఈ అంశాన్ని అధికారికంగా ఎప్పుడూ లేవనెత్తలేదని మాజీ రాయబారులు అభిప్రాయపడ్డారు. వివాదం తీవ్రమవుతుండటంతో నేపాల్ విదేశాంగ శాఖ వెంటనే రంగంలోకి దిగింది. ప్రధాని వ్యాఖ్యలు నోమ్యాన్స్ ల్యాండ్, సరిహద్దుల్లో పరస్పర భూ వినియోగం గురించేనని, అధికారిక ఆక్రమణల గురించి కాదని స్పష్టం చేసింది. సరిహద్దు స్తంభాల నిర్మాణం, దస్గ (నిర్వహణ కోసం సరిహద్దు వెంబడి ఉండే



స్ట్రిప్) ప్రాంతాలపై సాంకేతిక బృందాలు పనిచేస్తున్నాయని తెలిపింది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీ ప్రాంతాలపై ఇరు దేశాల మధ్య వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. 1816 నాటి సుగౌలీ ఒప్పందం ప్రకారం ఈ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తుండగా, అవి ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్పష్టం చేస్తోంది. 2021లో అప్పటి ఓలీ ప్రభుత్వం ఈ మూడు ప్రాంతాలను తమ భూభాగంలో చూపుతూ కొత్త మ్యాప్‌ను విడుదల చేయగా, భారత్ దానిని ఏకపక్ష చర్యగా పేర్కొంటూ తీవ్రంగా ఖండించింది. ఇటీవల కైలాస మానస సరోవర యాత్ర లిపులేఖ్ మీదుగా జరగడాన్ని కూడా నేపాల్ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో ప్రధాని బాలెన్ షా వ్యాఖ్యలు మరోసారి చర్చను రాజేశాయి.

# ప్రముఖ గాయని సుమన్ కళ్యాణ్‌పూర్ కన్నుమూత

## హిందీ, బెంగాలీ సహా 850 పైగా పాటలు పాడిన సింగర్



**ముంబయి, జూన్ 1:** చలనచిత్ర సంగీతయుగంలో తన మధుర స్వరంతో కొన్ని తరాలను ఉర్రూతలూగించిన ప్రముఖ నేపథ్య గాయని సుమన్ కళ్యాణ్‌పూర్ (89) కన్నుమూశారు. కొంతకాలంగా వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం సాయంత్రం ముంబైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. నెల రోజులుగా అనారోగ్యంతో ఉన్న సుమన్ కళ్యాణ్‌పూర్ ముంబైలోని లోఖండ్‌వాలాలో ఉన్న తన నివాసంలో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మరణించారు. నేటి (సోమవారం) మధ్యాహ్నం ముంబైలోని శాంటాక్రూజ్‌లో ఆమె అంత్య క్రియలు జరిగాయి. 1937 జనవరి 28న అప్పటి అవిభక్త భారతదేశంలోని ఢాకాలో జన్మించిన సుమన్ కళ్యాణ్‌పూర్ (అసలు పేరు సుమన్ హెమ్మడి) 1950ల ప్రారంభంలో తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1954లో విడుదలైన మంగు, శుక్రాచి చాందిని చిత్రాలతో ఆమె గాయనిగా అరంగేట్రం చేశారు. హిందీ, మరాఠీ, బెంగాలీ, గుజరాతీ సహా పలు భాషల్లో కలిపి 700 నుంచి 850కి పైగా పాటలు పాడారు. ఆమె గొంతు మాధుర్యం దిగ్గజ గాయని లతా మంగేష్కర్‌ను పోలి ఉండటంతో ఆమెను అభిమానంగా మరో లత అని పిలుచుకునేవారు. నా నా కర్తే ప్యార్ తుమ్హీ సే, ఆజ్ కల్ తేరే మేరే ప్యార్ కే, నా తుమ్ హమే జానో వంటి ఎన్నో అజరామరమైన గీతాలకు ఆమె ప్రాణం పోశారు. మహమ్మద్ రఫీతో కలిసి ఆమె దాదాపు 140 యుగళ గీతాలను ఆలపించారు. సంగీత రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం 2023లో ఆమెను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ఆమెకు కుమారుడు చారుల్ కళ్యాణ్‌పూర్ ఉన్నారు. సుమన్ కళ్యాణ్‌పూర్ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆమె మరణ వార్త అత్యంత హృదయ విదారకమని ఎన్సీపీ నేత శరద్ పవార్ పేర్కొన్నారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా ఆమె మధుర స్వరానికి నివాళులర్పించారు.



# మోసపూరితంగా అమెరికా న్యాయవ్యవస్థ : ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 1:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆ దేశ న్యాయ వ్యవస్థపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన ఆర్థిక విధానాలు, పరిపాలన నిర్ణయాలకు వ్యతిరేకంగా వరుసగా వస్తున్న కోర్టు తీర్పుల పట్ల అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కెన్నెడీ సెంటర్‌కు సంబంధించిన వివాదం.. టారిఫ్‌లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మన రాజకీయ వ్యవస్థ ఎంత అవినీతిమయంగా మారిందో.. కోర్టుల వ్యవస్థా అంతే దారుణంగా మోసపూరితంగా తయారైంది' అని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలకు ఈ విషయాలు స్పష్టంగా తెలుసని, అందుకే తాను భారీ మెజారిటీతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం తాను చివరివరకు పోరాడతానని స్పష్టం చేశారు. శనివారం తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ఈ వివరాలను ట్రంప్ పోస్టు చేశారు. కన్నెడీ సెంటర్ వ్యవహారంలో యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి క్రిస్టోఫర్ కూపర్ ఇచ్చిన తీర్పును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించిన న్యాయమూర్తి కూపర్.. కెన్నెడీ సెంటర్ పేరుతో చేపట్టాలన భావించిన కొన్ని మార్పులను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే వేసవిలో విస్తృత స్థాయిలో మరమ్మతులు, నిర్మాణ పనుల కోసం సాంస్కృతిక కేంద్రాన్ని మూసివేయాలన్న ప్రతిపాదనను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# 35 మందితో సిఎం సువేందు కేబినెట్ విస్తరణ

**కోల్‌కత్తా,జూన్ 1:** పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేపట్టిన సువేందు అధికారి ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం తాజాగా మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. 35 మంది బీజేపీ ఎమ్మెల్యేలు సోమవారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్‌ఎన్ రవి మంత్రులతో ప్రమాణం చేయించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164(1ఏ) ప్రకారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో 44 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 35 మందికి చోటు దక్కడంతో, సీఎంతో కలిసి మొత్తం 41 మంది మంత్రివర్గంలో ఉన్నారు. దీంతో మరోసారి మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉంది. ఇంకో ముగ్గురికి చోటుంది. గత నెల 9న సువేందు అధికారి సీఎంగా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనతోపాటు దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, నిశిత్ ప్రణామిక్, అశోక్ కీర్తనియా, క్షుదిరామ్ టూడు మంత్రులుగా ప్రమాణం చేశారు. సోమవారం ప్రమాణ స్వీకారంచేసిన వారిలో దీపక్ బర్మాన్, తపాస్ రాయ్, శంకర్ ఘోష్, మనోజ్ కుమార్ ఒరావోన్, గౌరీ శంకర్ ఘోష్, స్వపన్ దాస్ గుప్తా, కల్యాణ్ చక్రవర్తి, అరుప్ కుమార్ దాస్, దూద్ కుమార్ మోండల్, శరద్వాత్ ముఖర్జీ, జగన్నాథ్ చట్టోపాధ్యాయ్, అర్జున్ సింగ్ తదితరులున్నారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

## కొనుగోలు కేంద్రాల పరిశీలన... సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త, నడిగూడెం, సూర్యాపేట:** రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాలో సోమవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. సూర్యాపేట, హుజూర్నగర్ నియోజకవర్గాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. పలు సూచనలు ఇచ్చారు. తిరుమలగిరిలో ధాన్యం కొను గోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. హుజూర్‌నగర్ లో రామస్వామి గుట్ట వద్ద 2,160 సింగిల్ బెడ్ రూమ్ గృహాల పురోగతిపై సమీక్ష చేశారు. సీఎంఆర్‌ఎఫ్, కళ్యాణ లక్ష్మి ్మ, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మఠంపల్లి లో 80 లక్షల వ్యయంతో నిర్మించిన సెంట్రల్ కోఆపరేటివ్ సొసైటీ భవనం ప్రారం భోత్సవం చేశారు. హుజూర్నగర్ లో 50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రారంభించారు. గరిడేపల్లి మండలం కల్మలచెరువులో 3.50 కోట్ల వ్యయంతో రెండు బీటీ రోడ్లను ప్రారంభించారు. గడ్డిపల్లిలో 7.20 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

# ఆల్వాల్‌లో దోపిడి దొంగలు బీభత్సం

**హైదరాబాద్ (అల్వాల్), జూన్ 1, ప్రభాతవార్త:** అల్వాల్ మచ్చబొల్లారంలో దోపిడి దొంగలు పంజా విసిరారు. దైవ దర్శనం కోసం అరుణాచలానికి కుటుంబం వెళ్ళిన నేపధ్యంలో దొంగలు బంగారు ఆభరణాలు, నగదుకు దోచుకున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మచ్చబొల్లారం జిఎంఆర్ గార్డెన్ రూట్ ఎస్టేట్ కాలనీలో రమేష్ నివాసం ఉంటున్నారు. ఇతను ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల మే 29వ తేదీని కుటుంబంతో కలిసి దైవదర్శనం కోసం తమిళనాడు అరుణాచలంకు వెళ్ళారు. సోమవారం సాయంత్రం ఇంటి తాళాలు పగలు కొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు రమేష్‌కు సమాచారం అందించారు. బాధితుడు అల్వాల్ పోలీసులకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపాడు. సంఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌తో పాటుగా డిఐ వీరబాబు సందర్శించడం జరిగింది. ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలు కొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. ఇంటిలోని వస్తువులు అన్నింటిని నేలపై చిందర వందరగా పడేశారు. 30 తులాలు బంగారు, వెండి ఆభరణాలు, లక్ష రూపాయలు నగదుతో పాటుగా లాప్‌ట్యాప్‌ను ఎత్తుకెళ్ళారు. అరుణాచలంలో ఉన్న బాధితుడు రమేష్ నగరానికి చేరుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విశాఖ రైల్వే జోన్ ఆరంభం

## 12 యేళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం

## ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ఘనంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభోత్సవం

## భావోద్వేగానికి గురైన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

## కేక్ కట్‌చేసి కేంద్రమంత్రిని సత్కరించిన ఎమ్మెల్యే గౌతు శిరీష

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జూన్ 1 ప్రభాతవార్త:** విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన రైల్వేజోన్ ప్రారంభోత్సవ అధికారిక కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మో హన్ నాయుడు అత్యంత భావోద్వే గంతో మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ సాధన కోసం గత 12 సంవత్సరాలుగా తాను సాగించిన సుదీ ర్ఘ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో పార్ల మెంట్‌లో ఈ అంశంపై అనేకసార్లు గళమెత్తానని, ఇదే ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ప్రజాప్రతినిధిగా దీక్షలు కూడా చేప ట్టానని పేర్కొ న్నారు. 'అనాడు ఒక సామాన్య ప్రజా ప్రతినిధిగా ప్రజల పక్షాన నిలబడి పోరాడాను. ఈరోజు కేంద్ర మంత్రిగా బా ధ్యతలు నిర్వర్తిస్తున్న తరుణంలోనే ఆ కల సాకారం కావడం, నా చేతుల మీదు గానే ఈ జోన్ ప్రారంభం కావడం నా జీవితంలో ఎప్పటికీ మరువలేని మహత్తర ఘట్టం' అని హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నుండి విశాఖపట్నం కేంద్రం గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికా రిక పరిపాలన ప్రారంభమైందని కేంద్ర మంత్రి వెల్ల డించారు. నూతన జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికం గానే త్వరితగతిన పరిష్కారాలు లభి స్తాయని, పరిపాలన మరింత సులభతరం అవుతుందని చెప్పారు. గతంలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు కూడా ఉత్తరాంధ్రకు రైల్వేజోన్ సాధించడమే లక్ష్యంగా విశేష కృషి చేశారని, వారి ఆశయాలను ఈరోజు నెరవేర్చగలిగామని సగర్వంగా ప్రకటించారు. దాదాపు పుష్కర కాలంగా ఈ పవిత్ర ఆకాంక్షను భుజాలపై మోస్తూ, చివరకు అనుకున్నది సాధించామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభు త్వ సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నా మని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.3,300 కోట్ల భారీ వ్యయంతో 50కి పైగా రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో ఇచ్ఛాపురం ప్రాంతానికి కూడా ఒక కీల కమైన ఆర్‌ఓబీ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణ ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న వంతెన సమ స్యకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనే పూర్తిస్థాయి ముగింపు పలుకుతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పట్టణ ప్రగతికి, ప్రజల రవాణా సౌకర్యాలకు ఎటువంటి ఆటంకాలు లేకుం డా శాశ్వత పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. అలాగే, నూతనంగా సాధించిన పూరి- అహ్మ దాబాద్ రైలు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్య త్తులో ఈ రైలు సేవలు నేరుగా ఇచ్ఛాపురం నుంచే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని తన ఆకాంక్షను వెల్లడించారు.

**రూ.400 కోట్లతో ప్రధాన కార్యాలయ నిర్మాణం :**

విశాఖపట్నంలో 54 ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో సుమారు రూ.400 కోట్ల అంచనా వ్యయంతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు ఇప్పటికే శరవేగంగా ప్రారంభమయ్యాయని కేంద్రమంత్రి సమాచారం అందించారు. ఈ చారిత్రాత్మక పండుగ తరుణంలో తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా శ్రీకాకుళంజిల్లా ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే జోన్‌ను మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇందుకు నిరంతరం సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి జిల్లా ప్రజల తరపున కేంద్ర మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. ఇచ్ఛాపురం సరిహద్దు ప్రాంతమైన ఏ.ఎస్.పేట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద సౌత్ కోస్ట్ రైల్వే జోన్ బోర్డును ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడే మొక్కలు నాటారు. అనంతరం ఇచ్ఛాపురం మున్సి పాలిటీ 22వ వార్డులో లబ్ధిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధి దారులతో మంత్రి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బహిరంగ సభలో మాట్లాడి అనంతరం రైలులో ఇచ్ఛాపురం నుంచి పలాస బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లా ఉన్నతాధికారులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.




సోమవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రం మంత్రి రామ్మోహన్ నాయుడు, తదితరులు

# ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల గోల్‌మాల్‌పై సిఐడి కొరడా

## డఫా బెట్ యాప్ గుట్టురట్టు

## 11 మంది నేరగాళ్ల అరెస్టు, విదేశీకార్లుసహా ఫోన్లు జప్తు

## నిందితులను కస్టడీలోకి తీసుకుని అక్రమాల నిగ్గు తేలుస్తాం: సిఐడి చీఫ్ చారుసిన్హా




ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల అక్రమాలపై మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సిఐడి డిజి చారుసిన్హా. చిత్రంలో ఎస్‌పి అశోక్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల గోల్‌మాల్ కార్యకలాపాలపై సిఐడి మరోసారి కొరడా ఝుళిపించింది. కరీంనగర్‌లో ఏడాదిన్నర క్రితం ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పిలిఫిన్స్, దుబాయ్ కేంద్రంగా పనిచేసే డఫా బెట్ యాప్‌లో రూ.9.95 లక్షల రూపా యలు పోగొట్టుకోగా దీనిపై అక్కడి పోలీసులు నమోదు చేసిన కేసును సిఐడి విచారించి సదరు యాప్ అక్రమాలను నిగ్గు తేల్చింది. ఈ సంద ర్భంగా ఒక విదేశీయుడితో పాటు 11 మంది నేరగాళ్లు అరెస్టవగా వీరి వద్ద నుంచి మూడు ఖరీదైన కార్లు, 26 సెల్‌ఫోన్లతో పాటు మరికొన్ని వ స్తువులు, రూ.3.21 లక్షల నగదును జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి డిజి చారు సిన్హా సోమవారం మీడియాకు వెల్లడిం చారు. ఈ కేసులో మరిన్ని విషయాలను వెలికి తీసేందుకు నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

తెలంగాణలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించిన పోలీసు శాఖ ఇందులో భాగంగా అమాయకులను ఆన్‌లైన్ ఉచ్చులో లాగుతున్న యాప్‌లపై నిఘాను పెంచడంతో పాటు బాధితుల ఫిర్యాదులపై తీవ్రంగా స్పందిస్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో 2024 జనవరి నుంచి 2025 జనవరి వరకు డఫా బెట్ యాప్‌లో లాభాలకు ఆశపడి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.9.95 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయాడు.

ఈ కేసును విచారించిన సిఐడి బృందం సంచలన విషయాలను వెలికి తీసింది. సదరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి కాజేసిన డబ్బులను డఫా బె ట్ యాప్ నిర్వాహకులు, వారికి సహకరించిన ఇంకొందరు 46 బ్యాంకు ఖాతాలకు మళ్లించి అనంతరం అసలు నిందితులు కాజేశారు.

దాడుల సందర్భంగా గుజరాత్‌కు డఫా బెట్ యాప్ నిర్వాహకుడు మనీష్ సింగ్ (24), గుజరాత్‌కే చెందిన మరో నిర్వాహకుడు అభిషేక్ సింగ్ (26), ఢిల్లీకి చెందిన మ్యూల్ ఖాతాలు సమకూర్చిన ఇగ్నేషియన్ దాస్ (27), అభిషేక్ వాద్వా (27), (ఇతను ఆఫ్ఘనిస్తాన్‌కు చెంది ఢిల్లీలో వుంటున్న మహమ్మద్ హాలీం (24), పంజాబ్‌లోని పాటియాలకు చెందిన ల్ కుమార్ (28), లూధియానాకు చెందిన సిమన్ ప్రీత్ సింగ్ (41) (వీరిద్దరు నకిలీ సంస్థను సృష్టించి యాప్ నిధులు అందుకుంటున్నారు) మొదట పట్టుబడ్డారు. వీరి తరువాత గుజరాత్‌లోని గాంధీనగర్‌కు చెందిన అజిత్ సింగ్ (27), విజ య్ పాటిదార్ (24), ప్రతీక్ ప్రవీణ్ బాయ్ (25) (ఈ నలుగురు యాప్ నిర్వాహకులకు మోసాలు చేయడంలో సాంకేతికంగా మద్దతు ఇచ్చారు) నిందితులను ఆయా రాష్ట్రాలలో స్థానిక మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి వారంట్‌పై హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరుపరిచి జై లుకు తరలించారు.

# తెలంగాణలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు దిశగా కార్యక్రమాలు

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం: ఢిల్లీలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా భార తీయ జనతా పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం ఒక అంశమైతే, త్వరలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో పార్టీ ఎలా ముందుకు వెళ్లాలి, అలాగే తెలంగాణలో అధికారంలోకి రావడానికి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి అనే అంశాలపై కూడా మార్గదర్శనం చేసినట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ సోమవారం దేశంలోని అన్ని రాష్ట్రాల బిజెపి అధ్యక్షులు, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియాతో సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడారు. జాతీయ పార్టీ దృష్టిలో తెలంగాణ ఒక ముఖ్యమైన రాష్ట్రంగా ఉందని, సంస్థాగతంగా సైతం బలంగా ఉందని, అందుకే పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో కూడా తెలంగాణ వాసులతో కలిసి తెలంగాణ ఫార్మేషన్ డేను ఘనంగా నిర్వహించనున్నాం. ఈ కార్యక్రమానికి బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ హాజరవుతారని, తెలంగాణ ఉద్యమ చరిత్రకు సంబంధించిన మేధావులు, విద్యార్థులు, న్యాయవాదులు తదితరులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

# ఏజ్ చిన్నది.. గేమ్ పెద్దది

* ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ
* ఆరెంజ్ క్యాప్ (హైఎస్ట్ రన్స్)
* సీజన్ సూపర్ స్ట్రైకర్
* సీజన్ అత్యధిక సిక్సర్లు
* ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్
* మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్

ఈ ట్రోఫీలన్నింటి కోసం బీరువా కావాల్సి వస్తుందేమో.. అహ్మదాబాద్ ఫైనల్ వేదికలో వైభవ్ సూర్యవంశీని ఇంటర్వ్యూ చేస్తూ రవిశాస్త్రి చేసిన సరదా వ్యాఖ్య. ఇదే నిజం కూడా. రాజస్థాన్ రాయల్స్ ఫైనల్ ఆడకపోవయినా వండర్ కిడ్ క్రేజ్ మాత్రం తగ్గలేదు. అవార్డుల పంట పండింది. ఆర్సీబీ విజేతగా నిలిచిన తర్వాత జరిగిన ప్రైజ్ సెర్మనీలో ఈ కుర్రాడే కేంద్ర బిందువుగా మారాడు. ఈ సీజన్ మొత్తానికి అత్యంత ప్రతిభావంతుడైన ఆటగాడిగా ఎంపికై అందరి ప్రశంసలు అందుకున్నాడు. ఈ ఒక్కటితోనే సరిపెట్టకుండా ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీ, టోర్నీలో అత్యధిక పరుగులు చేసే ప్లేయర్‌కిచ్చే ఆరెంజ్ క్యాప్, సీజన్ సూపర్ స్ట్రయికర్, సీజన్ అత్యధిక సిక్సర్లు,మోస్ట్ వాల్యుబుల్ పేయర్ అవార్డులూ గెలుచుకుని మహా మహా ఆటగాళ్లే నోరేళ్లబెట్టేలా చేశాడు. అంతేకాదు యూనివర్సల్ బాస్‌నే మించిపోయి యూనివర్సల్ బేబీ బాస్‌గా కితాబు అందుకుంటున్నాడు వైభవ్.


(వార్త క్రీడా విభాగం)

ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండు నెలల పాటు క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించింది. ఆర్సీబీ వరుసగా రెండోసారి ట్రోఫీని కైవసం చేసుకోవడంతో ఐపీఎల్ 2026 సీజన్ ఎంతో ఉత్కంఠభరితంగా ముగిసింది. ఈ సీజన్‌లో సీనియర్ ఆటగాళ్లు తమ అనుభవంతో రాణించినప్పటికీ, కొంతమంది యువ ఆటగాళ్లు మాత్రం అసాధారణ ప్రదర్శనతో లీగ్‌ను శాసించారు. అత్యధిక పరుగుల ఛేజింగ్‌లు, వివాదాలు, రికార్డులతో సాగిన ఈ సీజన్.. భారత క్రికెట్‌కు ఎంతోమంది భవిష్యత్తు స్టార్లను పరిచయం చేసింది. అందులో అగ్రస్థానంలో ఉంటాడు యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ.

ఈ 15 ఏళ్ల క్రికెట్ వండర్ ఆడింది ఐపీఎల్ రెండో సీజన్ అయినా టోర్నీ ఆద్యంతం అందరి చూపు వైభవ్‌పైనే. ఐపీఎల్ 2026 సీజన్‌కు అసలైన బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచాడు. అందరీ అంచనాలను నిలబెడుతూ ఐపీఎల్ సీజన్ ఆద్యంతం అలరించాడు. 237.31 మైండ్ బ్లోయింగ్ స్ట్రైక్ రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. జస్ప్రీత్ బుమ్రా, ప్యాట్ కమిన్స్, భువనేశ్వర్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్, కగిసో రబాడా వంటి ప్రపంచ స్థాయి బౌలర్ల లైన్ అండ్ లెంగ్త్‌ను దెబ్బతీస్తూ పవర్‌ప్లేలో వైభవ్ ఆడిన ఇన్నింగ్స్‌లు ఈ సీజన్‌కే హైలైట్‌గా నిలిచాయి. ఈ సీజన్‌లో ఏకంగా 776 పరుగులు సాధించాడు. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, మిచెల్ మార్ష్, డేవిడ్ మిల్లర్, జోస్ బట్లర్ లాంటి దిగ్గజ ప్లేయర్లను వెనక్కి వైభవ్ సూర్యవంశీ ఆరంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు.

2025లో ఐపీఎల్ అరంగేట్రంలోనే సంచలన తారగా దూసుకు వచ్చాడు. అండర్-19 ప్రపంచకప్‌లో జోరు చూపిన వైభవ్ అదే మూమెంటమ్‌ను ఈ ఐపీఎల్ సీజన్ తొలిమ్యాచ్ నుంచే కొనసాగించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 35 బంతుల్లోనే సెంచరీతో చెలరేగిన వైభవ్, మరో మూడుసార్లు సెంచరీల ఊపులో కనిపించాడు. ముఖ్యంగా కీలకమ్యాచ్‌ల్లో వైభవ్ బ్యాటింగ్ పీక్‌కు చేరింది. గెలిస్తేనే ప్లే ఆఫ్‌కు చేరే మ్యాచ్‌లో 93రన్స్ సాధించాడు. ఇకనాకౌట్‌లో ఎస్ఆర్‌హెచ్‌పై మరింత విధ్వంసంసృష్టించాడు. 29 బంతుల్లోనే సెంచరీ ఫీట్ కొద్దిలో మిస్సయ్యాడు. ఇక గుజరాత్‌పై 96 రన్స్ సాధించాడు. ఈఐపీఎల్‌లో 327బంతులు మాత్రమే ఎదుర్కొని 776 రన్స్‌తో టాప్‌గా నిలిచాడు.



## నార్వే చెస్‌లో గుకేశ్, దివ్యకు ఓటమి

**ఓస్లో, జూన్ 1:** నార్వే చెస్ టోర్నమెంట్ ఆరో రౌండ్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు డి. గుకేశ్, దివ్య దేశ్‌ముఖ్ ఓటమిపాలయ్యారు. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్... జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమర్ చేతిలో పరాజయం పొందగా, మహిళల విభాగంలో దివ్య దేశ్‌ముఖ్‌పై ప్రపంచ ఛాంపియన్ జూ వెన్‌జున్ విజయం సాధించింది. ఇక పురుషుల విభాగంలో మాగ్నస్ కార్ల్‌సెన్ ఎట్టకేలకు సంచలన విజయం సాధించాడు. అగ్రస్థానంలో ఉన్న అలీరెజా ఫిరౌజ్జాను ఓడించాడు. కాగా ప్రజ్ఞానందపై వెస్లీ సో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకున్నాడు. మహిళల విభాగంలో బిబిసారా ఆర్మాగెడాన్ విజయంతో 9.5 పాయింట్లతో మళ్లీ టాప్‌లో నిలిచింది. దివ్య దేశ్‌ముఖ్ 8.5 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది.

గత మ్యాచ్‌లో నెగ్గి టైటిల్ రేసులో నిలిచిన గుకేశ్‌కు ఆరో రౌండ్‌లో అనూహ్య ఓటమి ఎదురైంది. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్‌ను విన్సెంట్ కీమర్ ఓడించడంతో మూడవ నిర్ణయాత్మక ఫలితం నమోదైంది. కీమర్ ఆట మధ్యలో ఆధిక్యాన్ని కొనసాగించి, తనకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాడు. ప్రపంచ ఛాంపియన్‌పై విలువైన విజయాన్ని నమోదు చేశాడు. ఆరవ రౌండ్ తర్వాత, నార్వే చెస్‌లో వెస్లీ సో ఆధిక్యంలో ఉండగా, అలీరెజా ఫిరౌజ్జా అతనికి సమీపంగా నిలిచాడు. దీంతో మొదటి స్థానం కోసం పోరు హోరాహోరీగా సాగుతోంది.



## జీ నెట్‌వర్క్‌కు ఫిఫా ప్రపంచకప్ ప్రసార హక్కులు

**న్యూఢిల్లీ, జూన్1:** భారత్‌లో ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల ప్రసారాలకు లైన్ క్లియర్ అయింది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా అతిమిస్తున్న ఫిఫా ప్రపంచ కప్ జూన్ 11 నుంచి ఆరంభం కానుంది. ఈ మెగా టోర్నీకి సంబంధించి భారత్‌లో ప్రసార హక్కులను జీ నెట్‌వర్క్ దక్కించుకుది. ఫిఫా ప్రపంచకప్ ఆరంభానికి 10 రోజుల ముందు ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఫిఫా ప్రపంచ కప్ మ్యాచ్‌లతో పాటు 2034 వరకు 38 ఫీఫా టోర్నీలకు సంబంధించిన మ్యాచ్‌లను జీ నెట్‌వర్క్ ప్రసారం చేయనుంది. ఈ విషయాన్ని జీ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారికంగా వెల్లడించింది. 2026 ఫిఫి ప్రపంచకప్‌తో పాటు ఫిఫా మహిళల ప్రపంచకప్ 2027, ఫిఫా ప్రపంచకప్ 2030 సహా మిగతా ఈవెంట్లకు సంబంధించిన మ్యాచ్‌లను భారత్‌లో జీనెట్‌వర్క్ ప్రసారం చేస్తుందని తెలిపింది. 8ఏళ్ల కాలానికి ఒప్పందం విలువ కూడా భారీస్థాయిలోనే ఉండనుంది. దేశంలోని ప్రముఖ క్రీడా ప్రసార సంస్థ జియోస్టార్ ఈ హక్కుల కోసం సుమారు 20 మిలియన్ డాలర్లను ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఫీఫా ఈ బిడ్‌ను తిరస్కరించింది. సోనీ సంస్థ కూడా ఈ హక్కుల ప్యాకేజీపై చర్చలు జరిపింది. కానీ చివరికి అది బిడ్ సమర్పించలేదు. భారతీయ బ్రాడ్‌కాస్టర్లు ఈ హక్కులను కొనుగోలు చేయడానికి అంతగా ఆసక్తి చూపకపోవడానికి మ్యాచ్‌ల సమయాలే పెద్ద సమస్యగా మారాయి. మొత్తం 104 మ్యాచ్‌లు జరుగుతుండగా.. అందులో కేవలం 14మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి లోపు ప్రారంభమవుతాయి. మిగిలినవన్నీ అర్ధరాత్రి దాటాక లేదా తెల్లవారుజామున ప్రారంభం కానున్నాయి.




## ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్, జొడార్

పారిస్, జూన్ 1: ఫ్రెంచ్ ఓపెన్‌లో రెండో సీడ్, జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్.. వరుసగా ఆరో ఏడాది క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 7-6 (7/3), 6-4, 6-1తో జెస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. మొదటి సెట్‌లో ఇద్దరూ పోటాపోటీగా తలపడ్డా జ్వెరెవ్‌దే పైచేయి అయింది. తరువాతి రెండు సెట్లలో మాత్రం జ్వెరెవ్ దూకుడు ముందు జెస్పర్ నిలవలేకపోయాడు. డిఫెండింగ్ చాంపియన్ అల్కారాజ్(స్పెయిన్) గాయంతో ఈ టోర్నీకి దూరంగా ఉండటం... ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) రెండో రౌండ్‌లో ఓటమి... మాజీ విజేత, సెర్బియా దిగ్గజం నోవాక్ జొకోవిచ్ మూడో రౌండ్‌లో వెనుదిరగడంతో... జ్వెరెవ్ టైటిల్ ఫేవరెట్‌గా అవతరించాడు. జ్వెరెవ్ తన స్థాయికి తగ్గట్టు ఆడితే గాండ్‌స్లామ్ టైటిల్ కల నిజమవుతుంది. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో.. 2024 ఫ్రెంచ్ ఓపెన్‌లో... 2020 యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన జ్వెరెవ్ మూడుసార్లూ ఓడిపోయి రన్నరప్‌గా నిలిచాడు.

మరోవైపు స్పెయిన్ రైజింగ్ స్టార్ రాఫెల్ జొడార్ ఆడుతున్న రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనే క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో 19 ఏళ్ల జొడార్ 4-6, 4-6, 6-1, 6-2, 6-2తో పాబ్లో కరెనో బుస్టా (స్పెయిన్)పై గెలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-అలెగ్జాండ్రా పనోవా (రష్యా) ద్వయం 1-6, 3-6తో డెసిరె క్రాసిక్ (అమెరికా)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) చేతిలో ఓడారు.

## యుద్ధభయాలతో నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

**ముంబయి, జూన్ 1:** భారతీయ స్టాక్ మార్కెట్లకు సోమవారం ట్రేడింగ్ భారీ నష్టాలను మిగిల్చింది. ఉదయం పూట అంతర్జాతీయ మార్కెట్ల మద్దతుతో 500 పాయింట్లకుపైగా లాభపడి సరికొత్త రికార్డుల వైపు పయనిస్తుందనుకున్న దలాల్ స్ట్రీట్ మధ్యాహ్నాం మూడు గంటల సమయానికి పూర్తిగా తిరోగమించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి ఒక్కసారిగా తీవ్రం కావడంతో మార్కెట్లు తమ లాభాలన్నింటినీ కోల్పోయి భారీ నష్టాలను చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఇ సెన్సెక్స్, ఎన్ఎస్ఇ నిఫ్టీ రెండు సూచీలు కూడా నష్టాల్లోనే స్థిరపడ్డాయి.

ఉదయం 23,700 మార్కును తాకిన నిఫ్టీ ముగింపు సమయానికి 165.15 పాయింట్లు పతనమై 23,400స్థాయికంటే దిగువన ముగిసింది. సెన్సెక్స్ 508.40పాయింట్ల మేర పతనమైంది. మధ్యాహ్నాం 3 గంటల తర్వాత మార్కెట్ ఇంతలా కుప్పకూలడానికి ప్రధానంగా పశ్చిమాసియా పరిణామాలు కారణమయ్యాయి. అమెరికా ఇరాన్ మధ్య శాంతి చర్చలు జరుగుతున్నాయనుకుంటున్న తరుణంలోనే, ఇరుదేశాలు పరస్పరం దాడులు



చేసుకోవడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఇరాన్ రాడార్, డ్రోన్ కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా దానికి ప్రతిగా కువైట్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి దాడులు చేసినట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లను భయాందోళనలకు గురిచేశాయి.

అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 93 డాలర్ల మార్కును తాకడం ద్రవ్యోల్బణ భయాలను మరింత పెంచింది. దీనికి తోడు గత శుక్రవారం ఏకంగా 21వేల కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించిన విదేశీ పెట్టుబడిదారులు, ఈ రోజు మధ్యాహ్నాం తర్వాత కూడా లార్జ్‌క్యాప్ షేర్లలో తమ అమ్మకాలను పెంచేసారు. బిఎస్ఇలో1589షేర్లు పెరిగితే 2761 కంపెనీలు నష్టపోగా 207కంపెనీలు యధాతథంగా కొనసాగాయి. కంపెనీల్లోప్రధానంగా ఐటిసి 2.53శాతం, ఎల్అండ్‌టి 1.61శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.33శాతంనష్టపోయాయి. విదేశీ కరెన్సీ మార్పిడిలో డాలరుతో రూపాయి మారకం విలువలు 94.94 రూపాయలుగా చెలామణి అయింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదు సెటిల్‌మెంట్ ధరలు 0.55శాతం క్షీణించి రూ.1,54,725గా కొనసాగాయి. ఇక కమోడిటీ మార్కెట్లలోబ్రెంట్ ముడిచమురు 2.91 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 94.03 డాలర్లుగా కొనసాగింది. ఆటో మొబైల్ సేల్స్ కూడా ఆ కంపెనీల షేర్లకు మద్దతుగా నిలిచాయి. నిఫ్టీలో ఐటిసూచి 2.66శాతం పెరిగింది. టెక్ మహీంద్ర 3.71, ఇన్ఫోసిస్ 3.67, ఎల్‌టిఐఎం 3.65, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 3.57, కాఫోర్జ్ 2.55శాతం లాభాల్లో ముగిసాయి. ఎన్ఎండిసి కూడా 13.18శాతం షేర్లుపెరిగింది. వొకార్డ్ 5.98, ఇండో కౌంట్ ఇండస్ట్రీస్ 7.26శాతంచొప్పున పెరిగాయి.

## మే నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 1:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. 2026 మే నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నేడు ప్రకటించింది. గత సంవత్సరం ఇదే నెలలో వసూలైన రూ.1.88 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 3.2 శాతం అధికం. రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.67 లక్షల కోట్లుగా ఉంది. ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 3.3 శాతం ఎక్కువ. ఏప్రిల్‌లో నమోదైన రికార్డు స్థాయి రూ.2.43 లక్షల కోట్ల వసూళ్లతో పోలిస్తే మే నెలలో ఆదాయం తగ్గింది. ప్రతి సంవత్సరం ఆర్థిక సంవత్సరం ముగింపు తర్వాత మే నెలలో వసూళ్లు తగ్గడం సాధారణమేనని అధికారులు చెపుతున్నారు. ఈసారి జీఎస్టీ వసూళ్లలో దిగుమతులు కీలక పాత్ర పోషించాయి.

దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 2.6 శాతం తగ్గి సుమారు రూ.1.34 లక్షల కోట్లుగా నమోదు కాగా, దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు 19.1 శాతం పెరిగి రూ.59,654 కోట్లకు చేరుకోవడం గమనార్హం. మే నెలలో మొత్తం రిఫండ్‌లు 2.6 శాతం పెరిగి రూ.27,281 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో అంటే ఏప్రిల్, మేనెల స్థూల జీఎస్టీ వసూళ్లు 6.2 శాతం వృద్ధితో రూ.4.37 లక్షల కోట్లకు చేరాయి.




## ఏప్రిల్ ఆర్థికలోటు రూ.3.62 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 1:** కేంద్ర ఆర్థికలోటు ఒక్క ఏప్రిల్‌నెలలోనే బడ్జెట్ అంచనాల్లో 21.4శాతానికి చేరింది. కాగ్ నివేదికలప్రకారం ఆర్థికలోటు 3.62 లక్షల కోట్లుగా ఉందని సోమవారం డేటా విడుదల చేసింది. గత ఆర్థికసంవత్సరంలోని గణాంకాలతో పోలిస్తే రెట్టింపుస్థాయికి ఆర్థికలోటు నమోదయింది. అమెరికా ఇరాన్ యుద్ధం సందర్భంగా పెరిగిన వ్యయాలే ఇందుకు కారణమని తెలుస్తోంది. పశ్చిమాసియా యుద్ధం ముడిచమురుధరలపై తీవ్ర ప్రభావంచూపించింది. చమురుధరలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రభుత్వం కూడా విండ్‌ఫాల్ పన్నులను తగ్గించింది. చమురు కంపెనీలు, ప్రభుత్వం పెరిగిన ధరలను సాధ్యమైనంతగా ప్రజలపై భారం పడకుండా చూసాయి. చివరిరోజుల్లో మాత్ర మే పెట్రోడీజిల్, ఎటిఎఫ్, గ్యాస్‌ధరలు పెంచాయి. ఇక రెవెన్యూ లోటు బడ్జెట్ అంచనాలతో పోలిస్తే 30.8శాతంగా ఉంది. అంటే రూ.1.82 లక్షల కోట్లుగా ఉంది. రెవెన్యూ వ్యయంలో జీతాలు, పింఛ్లు, వడ్డీచెల్లింపులు, సబ్సిడీలు వంటివి ఉంటాయి. ఇందుకుభిన్నంగా బడ్జెట్ అంచనాల్లో పొందుపరిచిన విధంగా పన్ను, పన్నేతర రాబడులు, గ్రాంట్లు వంటివి రెవెన్యూ రాబడులుగా ఉంటాయి. ఏప్రిల్‌లో 2.03 లక్షలకోట్లుగా ఉన్నాయి. అంటే బడ్జెట్ అంచనాల్లో 5.7శాతంగా ఉన్నట్లు తేలింది. మొత్తం వ్యయం కూడా బడ్జెట్ అంచనాల్లో 10.8శాతానికి చేరుకుని రూ.5.75 లక్షల కోట్లుగా ఉన్నాయి. ముగిసిన ఆర్థికసంవత్సరంలో ఆర్థికలోటు బడ్జెట్ లక్ష్యాల్లో 97.5శాతానికి చేరింది. కాగ్ లెక్కల ప్రకారంచూస్తే జిడిపిలో ఆర్థికలోటు 4.4శాతంగా ఉంది. అంటే రూ.15.19 లక్షలకోట్లు, రెవెన్యూ లోటు రూ.18.20 లక్షల కోట్లుగా ఉంది. రెవెన్యూ రాబడులు గత ఏడాది రూ.338.60 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక మొత్తం వ్యయం పరంగాచూస్తే రూ.490.52 లక్షల కోట్లు అని కాగ్ నివేదించింది.

## పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 4.9శాతంగా నమోదు

**ముంబయి, జూన్ 1:** భారత పారిశ్రామిక ఉత్పత్తిసూచీ ఏప్రిల్ నెలకుగాను 4.9శాతంగా నమోదయింది. గత ఏడాది ఇదే కాలానికి గాను 5.7శాతంగా నమోదయిన వృద్ధి ఈసారి వెనుకంజ వేసింది. 2022-23 సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుని సోమవారం ఉత్పత్తిసూచీ వివరాలను ప్రకటించింది. ఉత్పత్తిరంగంలో 6.2శాతంగా ఉంది. ఎన్ఎస్ఒ విడుదలచేసిన గణాంకాలను పరిశీలిస్తే ఐఐపి ఏప్రిల్‌నెలలో 118.9 పాయింట్లుగా ఉంది. గత ఏడాది ఇదే నెలలో 113.1 పాయింట్లతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. విద్యుత్, గ్యాస్ రంగాల సూచీలు 125.5గా ఉన్నాయి. గత ఏడాది ఇదేనెలలో 119.6 పాయింట్లతో పోలిస్తే పెరిగింది. మంచినీటి సరఫరా, మురుగు నీటిశుద్ధి వ్యవస్థ, నీటిసంరక్షణ సూచీ 137.1 పాయింట్లనుంచి 146.1 పాయింట్లకుపెరిగింది. ఇక మైనింగ్ క్వారీయింగ్‌రంగాల్లో మాత్రం క్షీణించింది. 110.2 పాయింట్లనుంచి 104.6 పాయింట్లకు దిగజారింది. కేంద్ర అర్థగణాంకశాఖ, పథకనిర్వహణ మోస్పీ అంచనాలప్రకారం 23 ఉత్పత్తిరంగ గ్రూపులు సానుకూల వృద్ధినినమోదుచేసాయి. మోటారు వాహనాలు, ట్రైలర్లు, సెమి ట్రైలర్లు, విద్యుత్ సామగ్రి, ఇతర పరికరాలు వృద్ధిలో ఉన్నాయి. ఇక భారీ యంత్రాల తయారీ ఉత్పత్తి 16శాతం, ఇంటర్మీడియేట్ గూడ్స్ ఉత్పత్తి 7.7, మౌలికవనరులు, నిర్మాణరంగ ఉత్పత్తులు 7.1 శాతం, వినియోగరంగ ఉత్పత్తులు 4.3శాతం, నాన్ కన్స్యూమర్ ఉత్పత్తులు 2.8శాతం పెరిగాయి.



## పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర

**న్యూఢిల్లీ, జూన్ 1:** వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ల ధరలను ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పెంచాయి. జూన్1 నుంచి ఈ కొత్తధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ. 42 పెరగడంతో రూ.3,113.50కి చేరింది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పులు చేయకపోవడం సామాన్య ప్రజలకు ఊరటనిచ్చింది. ఈధరలపెంపు ఇతర నగరాల్లోనూ వర్తిస్తుంది. కోల్‌కతాలో 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధర రూ.53.50 పెరిగి రూ. 3,255కి చేరుకుంది. తాజా పెంపుతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.3294కు చేరింది. ఇక చెన్నైలో రూ.3232, పాట్నాలో 3322గా ఉంది. వీటితో పాటు ఢిల్లీలో 5 కేజీల ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ (ఎఫ్టీఎల్) సిలిండర్ ధర కూడా రూ.11 పెరిగి రూ. 821.50కి చేరింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.